విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

ఆదివారం 15 డిసెంబరు 2024 8 పేజీలు

దోకిపర్రులో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం దోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పి.వి. కృష్ణారెడ్డి దంపతులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయం నిర్మాణాన్ని మిగతా 2లో ...

అవినీతిపై సీపీఐ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్
- అబ్బురపరచిన రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు
- ముగిసిన రెడ్‌షర్ట్ వలంటీర్ల శిక్షణ

విశాలాంధ్ర-నందిగామ: అవినీతి అక్రమాలపై సీపీఐ పోరాడుతుందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని జనసేవాదళ్ రెడ్ షర్ట్ వలంటీర్ల శిక్షణ శిబిరం నందిగామలో నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం జరిగిన సభకు శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో అధికార ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేల అవినీతిపై సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పోరాడుతామని ప్రతినబూనారు. జగ్గయ్యపేట పరిశ్రమల వద్ద నుండి పరిటాల క్వారీలు,నందిగామ జగ్గయ్యపేట ప్రాంతాలలో ఇసుక గ్రావెల్, మైలవరం ప్రాంతంలో వీటీపీఎస్ గ్రావెల్ తవ్వకాలు గతంలో వైసీపీ నాయకులు చేస్తే ప్రస్తుతం తెలుగుదేశం పెద్దలు దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్న చందంగా దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేల అవినీతిపై సీపీఐ పోరాటం చేస్తుందన్నారు.

అబ్బురపరచిన ఎర్రదండు కవాతు:

రెడ్ షర్ట్ వలంటీర్ల, జనసేవాదళ్ శిక్షణ ముగింపు సందర్భంగా శత వసంతాల సూచికగా 100 అడుగుల సీపీఐ జెండాతో ఎర్రదండు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సీపీఐ కార్యాలయం నుండి గాంధీ సెంటర్ వరకు వలంటీర్లు ఎర్ర టీ షర్టులు ధరించి కవాతు మిగతా 2లో ...

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే

కఠిన చర్యలు

క్రిమినల్ కేసులు నమోదు : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదని మాతా, శిశు మరణాలు సంభవించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సమష్టి కృషితో మాతా, శిశు మరణాల పూర్తిస్థాయి నియంత్రణపై దృష్టిపెట్టాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శనివారం వైద్య, ఆరోగ్యశాఖాధికారులు, సిబ్బందితో మిగతా 2లో ...

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి

నైతిక విలువలు బోధించాలి... మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-పొన్నూరు : ఎస్టీయూ గుంటూరు జిల్లా 78వ వార్షిక కౌన్సిల్ సమావేశం పొన్నూరు సమీపంలోని చింతలపూడి గ్రామంలో జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం సమస్యలు' అనే అంశంపై 78వ జిల్లా వార్షికోత్సవ సమావేశం జరిగింది. ముఖ్యవక్తగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, ఏఐఎస్టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు మంచి సంబంధాలు క్షీణించాయని అన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని, పాఠశాల నుంచి ఇంటికి వెళ్లినప్పటి నుంచి సామాజిక మాధ్యమాల ప్రభావంతో మిగతా 2లో ...

'విశాలాంధ్ర' క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ టౌన్ : విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో విశాలాంధ్ర-2025 క్యాలెండర్‌ను జనరల్ మేనేజర్ పీ హరినాథరెడ్డి శనివారం ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా మిగతా 2లో ...

18న నదుల అనుసంధానంపై

రైతు, కార్మిక ప్రజా సంఘాలతో అఖిలపక్షం

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రంలో నదుల అనుసంధానం పై ఈనెల 18వ తేదీన నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ కృష్ణా గోదావరి పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టు, హరిశ్చంద్రా పురం నుండి నకరికల్లు వద్ద ఎత్తిపోతల పథకం పనులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని ఈ ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులకు సాగు నీరు ప్రజలకు త్రాగు నీరు పూర్తిగా అందుతాయని ఈ ప్రాంతాలు సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతులు, ప్రజల కోరిక మేరకు ప్రాజెక్టును వెంటనే మిగతా 2లో ...

(మొదటి పేజీ తరువాయి)

'విశాలాంధ్ర' క్యాలెండర్ ఆవిష్కరణ

విడుదల చేసిన క్యాలెండర్‌ను విశాలాంధ్ర వినుకొండ జర్నలిస్టు అజాద్‌కు జీఎం హరినాథ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు, చీఫ్ అకౌంటెంట్ రాంబాబు, ఎడిషన్ మేనేజర్ సాయిబాబు, ప్రింటింగ్ సెక్షన్ ఇంచార్జి గంప శ్రీనివాస్ పాల్గొన్నారు.

డోకిపర్రులో సీఎం చంద్రబాబు

పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కృష్ణారెడ్డి దంపతులు బాగా అభివృద్ధి చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు గురించి ప్రస్తావించాం. 2047 నాటికి ప్రపంచంలో భారతదేశం, దేశంలో ఏపీ అగ్రభాగాన ఉంటాయి. జమిలి విధానంలో భాగంగా దేశంలో ఎన్నికలన్నీ ఒకసారి జరిగితే అభివృద్ధి చేసుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. మూడు నెలలకు ఒకసారి దేశంలో ఎన్నికలు జరుగుతూ ఉంటే పాలకులు ఎన్నికల కోసమే పని చేయాల్సి ఉంటుంది' అని అన్నారు. పీ4 విధానంలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలోని బీపీఎల్ కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు చొరవ తీసుకోవాలని కృష్ణారెడ్డికి సీఎం చంద్రబాబు సూచించగా ఆయన అంగీకరించారు. ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు పారిశ్రామిక వేత్తలు తోడ్పాటునందించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మాతా, శిశుమరణాలపై సమీక్షించారు. గత అక్టోబర్‌లో నమోదైన ఒక మాతృ, రెండు శిశు మరణాల నివేదికలను పరిశీలించి, కారణాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకునేలా, పోషకాహారం తీసుకునేలా, వైద్య సేవలు పొందేలా ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీ, వైద్యులు బృందంగా పనిచేయాలన్నారు. గ్రామస్థాయి సిబ్బంది గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం, మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణీల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదుచేసి హైరిస్క్ ఉన్నవారి పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అత్యంత అనుభవమున్న వైద్య నిపుణులతో కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఏ దశలోనైనా ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రుల వైద్యసేవల్లో నిర్లక్ష్యం రుజువైతే క్రిమినల్ కేసులు పెట్టేందుకూ వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా.సుహాసిని, డీసీహెచ్ఎస్ డా.నాయక్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ఇందుమతి, లైజనింగ్ అధికారి డా.పద్మావతి, డీపీహెచ్ఎన్‌వో డా.లిడియా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి

చెడు వ్యసనాలకు ప్రభావితం అవుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పాఠశాలల్లో విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి తోడ్పడే విధంగా క్రీడా స్థలాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైతిక విలువల బోధనకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా క్రాఫ్ట్ డ్రాయింగ్ తదితర నైపుణ్యాల పెంపుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా విధానంలో గత ప్రభుత్వం జీఓ 117 తీసుకురావడం వలన ప్రాథమిక విద్య బడుగు బలహీన వర్గాలకు దూరమై దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు పాఠశాలకు దూరంగా అనగా డ్రాప్ అవుట్లుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినప్పటికీ పీఎఫ్, ఏపీ జీఎల్ఐ సరెండర్ లీవ్ బకాయిలు తదితరాలు దాదాపు రూ.21000 కోట్లు ఉన్నాయని, ఆ బకాయిలను చెల్లించకపోతే రాబోయే రోజులలో కలిసి వచ్చే సంఘాలతో కలిపి ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఎస్టీయూ ఎప్పటినుంచో కోరుతున్నటువంటి శాశ్వత బదిలీల చట్టాన్ని రూపకల్పన చేసి అమలు చేయడానికి తగు చర్యలు తీసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణా తరగతులను వేసవి సెలవులలోగాని, అన్‌లైన్‌లోగాని అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డిలి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా... ఆర్థిక కార్యదర్శి ఎల్.వీరాంజనేయులు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సంఘ పురోభివృద్ధికి క్షేత్రస్థాయిలో పాటుపడిన ఉపాధ్యాయులు, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులకు వివిధ మండలాల నుంచి ఎంపిక చేసి వారిని 'ఉత్తమ ఉపాధ్యాయులుగా' సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్‌వీ రామిరెడ్డి, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ప్రసాదరావు, ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

18న నదుల అనుసంధానంపై రైతు, కార్మిక ప్రజా సంఘాలతో అఖిలపక్షం

పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఈ అఖిలపక్ష సమావేశానికి రైతు సంఘాలు, కార్మిక సంఘాలు మరియు అన్ని ప్రజా సంఘాల నుండి నాయకులు పాల్గొని జయప్రదం తమ సలహాలను సూచనలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ రాజు, సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్‌కె చిన్న జాను సైదా తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై సీపీఐ పోరాటం

నిర్వహించారు. నందిగామ ప్రధాన రహదారులు ఎర్ర జండాలతో కళకళలాడాయి. సూర్యదేవర నాగేశ్వరరావు నందిగామ ప్రజలకు మరోసారి

గుర్తుకు వచ్చేలా నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురిని అబ్బుర పరిచింది. సీపీఐ శతజయంతి ఉత్సవాలు ప్రారంభ కార్యక్రమం సూర్యదేవర నాగేశ్వరరావు పుట్టిన గడ్డపై నిర్వహించటం అదే స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలో జిల్లా నాయకుల సారథ్యంలో నందిగామలో రెడ్ షర్ట్ వలంటీర్స్ జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమాలు

జగరటం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు స్వాగతం పలకగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు వందన సమర్పణ చేశారు ఈ కార్యక్రమంలో జనసేవ దళ్ రాష్ట్ర సీనియర్ శిక్షకులు నార్ల వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, వీరులపాడు ఎంపీటీసీ సభ్యులు ఎం ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

17 నుండి నిరవధిక సమ్మె

విశాలాంధ్రబ్యూరో,మచిలీపట్నం : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పెడచెవిని పెడుతున్న సందర్భంగా ఈనెల 17వ తేదీ నుండి కృష్ణాజిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిశుద్ధ కార్మికులు చేయ తలపెట్టిన నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటియుసి మచిలీపట్నం కార్యదర్శి ఓ ఎల్ రావు పిలుపునిచ్చారు.శనివారం డిఎస్పి కి సమ్మె నోటీసు అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల శానిటేషన్ కార్మికులు నాలుగు సంవత్సరాలుగా వారికి రావలసిన పిఎఫ్ మరియు ఈఎస్ఐ బకాయిల గురించి రెండు రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 17వ తేదీ నుండి ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయినా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె జరుగుతుందని, దీని కొరకు అందరూ సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, ఫణీంద్ర, నాగమల్లి, ధనలక్ష్మి, కమల, దుర్గ, శివలలిత, లాజరమ్మ, ఓ నాగలక్ష్మి, పి వెంకటలక్ష్మి, పివి రమణ,అంజలి, నిర్మల ఎస్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చలో గుంటూరును విజయవంతం చేయండి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి

విశాలాంధ్ర-గుడివాడ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15 అదివారం గుంటూరులో జరిగే అఖీల భారత్ మాల సంఘల జెఏసి అధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి జయరాజు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్రచారం వాహనాలను, గోడ ప్రతికను విడుదల చేశారు. ఈ సందర్బంగా పొంగులేటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీలలోని మాల వర్గనికి ద్రోహం చేసే విధంగా సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. వర్గీకరణకు వేతిరేకంగా రాష్ట్రంలోని మాలలు ఐక కంతతో వర్గీకరణను నిలుపదల చేయాలని ఎన్ని పోరాటాలు చేసిన పట్టంచుకోకపోవడంతో ఈ నెల 15న గుంటూరులో అన్నీ మాల సంఘల అధ్వర్యంలో జెఏసిగా ఏర్పాడి మాలల మహాగర్జన బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అ సభకు మాలలు లక్షాధిగా తరలిరావలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంతగాని సురేష్, తంటేపూడి అనిల్, సాదే విజయకుమార్, దారం కరుణాకార్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురం లేఅవుట్ అభివృద్ధి పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కేతన కొండలోని శ్రీహరిపురం లేఅవుట్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని శ్రీహరిపురం ప్రభుత్వ ఉద్యోగుల కో.ఆపరేటివ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్, కార్యదర్శి వి.రత్నప్రసాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ధర్నా చౌక్‌లో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్టుగేజ్ ప్లాట్లు సభ్యులు 69 మందికి ప్లాట్లు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. 019లో 85 ఎకరాల పొలం, 110 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశామని చెప్పారు. భూ యజమానులకు పూర్తి మొత్తం చెల్లించకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తమ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ఉముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కి వినతి ఇప్పటికే వినతి పత్రాలు సమర్పించినట్లు చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీఎస్ఎన్.రాజు, సభ్యులు , ప్లాట్లు యజమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం కృష్ణాజిల్లా 25వ మహాసభలు

విశాలాంధ్ర-చల్లపల్లి : దివితాలూకా అమరవీరుల స్మారకార్థం చల్లపల్లిలో నిర్మించిన అమరస్థూపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సీపీఎం కృష్ణాజిల్లా 25వ మహాసభలు ఆదివారం నుంచీ ప్రారంభం కానున్నాయి. మహాసభల నేపథ్యంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతులు అమరస్థూపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సుమారు 45 అడుగుల ఎత్తైన స్థూపానికి రంగులు వేయించటంతోపాటు ఆ ప్రాంగణంలో పేవర్ టైల్స్ వేయించారు. చుట్టూ ప్రహరీల మరమ్మత్తులు చేయించి రంగులు వేయించి బయట జెండా స్థూపాన్ని ఏర్పాటుచేశారు. స్థూపం ప్రాంగణంలో గ్రీనరీ ఏర్పాటుచేయనున్నారు. సుందరంగా తీర్చిదిద్దిన అమరస్థూపం వద్ద సీపీఎంనేతలు జెండాలతో అలంకరించారు. 15వ తేదీ ఆదివారం నుంచీ మూడు రోజులపాటు మహాసభలు జరుగనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు అమరస్థూపం నుంచీ ర్యాలీ ప్రారంభం కానుంది.

క్రీడల అభ్యున్నతికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని, మౌలిక వసతులు కల్పిస్తూ క్రీడలను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ 44వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో బహుమతులు సాధించిన క్రీడా కారులకు పతకాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందజేశారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా క్రీడలను కూడా దోపిడికి వాడుకోవడంతో రాష్ట్రంలో క్రీడల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో స్పోర్ట్స్ కోటాను పెంచుతూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మంచి నిర్ణయమన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతత, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. తొలుత రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టీడీపి నాయకులు చేకూరు జగన్‌మోహన్‌రావు, ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి డా॥ఎం.వి ప్రసాద్, ఆర్గనైజర్స్ అప్పలస్వామి, చౌదరి, వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 45 కేసుల పరిష్కారం

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్‌కి సంబంధించి 45 కేసులకు జరిమానాలు విధించి కేసులు కొట్టి వేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అశ్రఫున్నిసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన అలాగే గత కొంతకాలంగా పెండింగ్ లో ఉన్న 45 కేసులు నందిగామ కోర్టులో ఈరోజు జరిగిన లోక్ అదాలత్ లో హాజరు పరచగా జరిమానా విధించి కొట్టివేయటం జరిగిందని వివరించారు. 45 కేసులకు గాను 243550 రూపాయల నగదు జరిమానా ప్రభుత్వానికి చెల్లించడం జరిగిందని తెలిపారు.

ట్రాక్టర్ యజమానులపై కేసులు నిలిపివేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : చల్లపల్లి మండలంలో కేవలం వైసీపీపై నమోదు చేస్తున్న అక్రమ కేసులను నిలిపివేయాలి అని వైసీపీ నాయకులు గౌతం అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఉన్న కృష్ణానది పరివాహ ప్రాంతంలో అధిక భాగం సి ఆర్ జెడ్ పరిధిలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక బుసకను నియోజక వర్గంలో టిప్పర్లు ట్రాక్టర్లు ద్వారా వందలాదిగా అక్రమంగా తరలిస్తున్నా, పర్యావరణ శాఖ నేతలు, మీడియా పోలీసు, రెవెన్యూ దోపిడీ ఆపకపోవడంలో అర్థం ఏమిటి అని ఆయన శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిడితో పట్టించుకోని రెవెన్యూ పోలీస్ వ్యవస్థ వ్యవసాయ పనులు అనంతరం కడిగి శుభ్రపరుచుకునే నిమిత్తం నదికి వెళ్లిన చల్లపల్లి మండలంలోని నడకుదురు పురిటిగడ్డ నిమ్మగడ్డకు చెందిన వైసీపీకి చెందిన కాళీ ట్రాక్టర్లు మాత్రమే చల్లపల్లి పోలీసులు ఆపి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారంటూ వారిపై వోల్టా యాక్ట్ కింద అక్రమ కేసులు బనాయించి ఇసుక అక్రమ రవాణాని సమర్థవంతంగా అడ్డుకున్నామని చెప్పడం దారుణం అన్నారు.

ఉద్యోగ మేళాలో 1535 మంది ఎంపిక

విశాలాంధ్ర-గన్నవరం : రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరుద్యోగులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎనికెపాడులో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఉద్యోగాల హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగ మేళాకు యువత నుండి విశేష స్పందన కనిపించిందని తెలిపారు. ఉద్యోగ మేళాలో మొత్తం 3125 మంది హాజరుకాగా.. 1535 మందికి వివిధ కంపెనీల్లో ఎంపిక అయ్యారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కంపెనీలు వెనక్కి తిరిగి వెళ్ళిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు కూడా నిరుద్యోగులుగా మారిపోయారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో యువత గంజాయి బారిన పడ్డారన్నారు. జగన్ తన పాలనలో రాజకీయ నిరుద్యోగులకు మాత్రమే ఉపాధి కల్పించారని విమర్శించారు. “నేను కేడీసీసీ బ్యాంకును అభివృద్ధి చేస్తే అప్పటి ముఖ్యమంత్రి జగన్ నన్ను ఎందుకు చైర్మన్ బాధ్యతల నుంచి తప్పించారు” అని ప్రశ్నించారు. చిన్న చిన్న పనులు కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. 60 సంవత్సరాల వయసులో పార్టీ పెట్టిన వ్యక్తి ఎన్టీఆర్ అని పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని 2 రూపాయలకు కిలో బియ్యం పథకం తెచ్చిన మహనుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆ పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని విమర్శించారు. అనంతరం మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు సెలెక్ట్ అయిన వారికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములు అంకురార్పణకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో జరిగే అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం కార్యక్రమ ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం కార్యక్రమ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ఏర్పాట్లలో ఎలాంటి లోపం, పొరపాట్లు ఉండరాదని, నగరపాలక సంస్థ చేయాల్సిన వసతుల్లో లోటుపాట్లు లేకుండా చూడటంతో పాటు వచ్చిన ప్రతి ఒక్కరికి త్రాగునీటి సరఫరాలో అసౌకర్యం కలగకుండ చూడాలన్నారు. నిరంతరం పారిశుధ్య నిర్వహణ పక్కాగా నిర్వహిస్తూ కార్యక్రమం జరిగే ముందు, జరిగే సమయంలో, కార్యక్రమం అనంతరం కూడా చర్యలు తీసుకోవాలని అందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సత్యకుమారి, సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

నిత్యం అన్నా క్యాంటీన్లు పర్యవేక్షించాలి

నగరంలోని అన్నా క్యాంటీన్లను నోడల్ ఆఫీసర్లు నిత్యం పరిశీలిస్తుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. స్థానిక వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 11 ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లలో త్రాగునీటి సరఫరా, వాడుక నీరు, కిచెన్‌లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, భోజనంలో నాణ్యత, ప్రతిరోజు ఇస్తున్న టోకెన్ల వివరాలు నోడల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఆయా క్యాంటీన్లలో ఎలాంటి మరమ్మతులున్నా చేయించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజల కోసం ఐదు రూపాయలకే భోజనం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.

ఫుట్ బాల్ యూనివర్శిటీ ఛాంపియన్ కేబీఎన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఈ నెల 10, 11 తేదీల్లో విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల ఫుట్ బాల్ పోటీల్లో అద్భుతమైన ఆటతీరుతో అత్యధిక గోల్స్ చేసిన తమ కళాశాల జట్టు యూనివర్శిటీ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుందని కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. ఈ విజయం సాధించడం ద్వారా తమ కళాశాల టీం సభ్యులు బి. ప్రేమ్ తేజ, ఎం. లీలా మనోహర్, పి. జాషువా, కె.దీపక్ చందు, బి.దుర్గాప్రసాద్ త్వరలో క్యాలికట్ యూనివర్శిటీ కేరళలోజరగబోయే దక్షిణ భారత అంతర్విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్బాల్ పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావు ను ఎస్.కె.పి.వి.వి హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అభినందించారు.

ప్రశాంతంగా సాగు నీటి సంఘాల ఎన్నికలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని ఎనిమిది సాగు నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు తహశీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 145-కపిలేశ్వరపురం కి అధ్యక్షుడుబీ కొల్లిపర వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడుబీ మైనేని కోటేశ్వరరావు 146-గురజాడ-తాతినేని రామచంద్రరావు,బెడా కరణం బేగ్ 147-పమిడిముక్కల: నాదెళ్ల సుబ్రహ్మణ్యం, కరిమికొండ వెంకటేశ్వరరావు 148హనుమంతపురం(గడ్డిపాడు): నందమూడి శివ ప్రసాద్,చోడిశెట్టి పవన్ కుమార్ 149-మేడూరు: మైనేని పూర్ణచంద్రరావు, వై.శ్రీరంగం 151-చోరగుడి: తిరుమలశెట్టి శ్రీనివాస రావు,దాకినేని వెంకట మోహన్ రావు 152-పెనుమత్స: సురపనేని రాధాకృష్ణ ప్రసాద్, పొట్లూరి బ్రహ్మేశ్వర రావు,186-ఐలూరు:కడియాల వెంకట రామ్,కె.గురవయ్య లు ఎన్నికైనట్లు తహశీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు.

రాజబాబుకు గుమ్మడి జైరాజ్ జాతీయ రంగస్థల పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : గుమ్మడి జైరాజ్ 12వ సంస్మరణ సందర్భంగా శనివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై గుమ్మడి జైరాజ్ కళాపీఠం, శ్రీదేవి కళానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రంగస్థల స్వర మేరువు, రంగస్థల సంగీత సారథి, ప్రసిద్ధ హార్మోనిస్ట్ డాక్టర్ టి రాజబాబుకు ఆహూతుల కరతాళధ్వనుల మధ్య గుమ్మడి జైరాజ్ జాతీయ రంగస్థల పురస్కార ప్రదానం జరిగింది. పురస్కార గ్రహీత రాజబాబు ను, అతిథులను మొట్టు ఆంథోని సభా పరిచయం చేయగా సభాధ్యక్షుడిగా కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి విజయకుమార్ వ్యవహరించారు. అతిథులుగా పలు రంగాల నగర, నగరేతర ప్రముఖులు, రంగస్థల ఉద్దండులు, కళాకారులు మాట్లాడుతూ కృష్ణ లీలలు నాటకంలో చిన్ని కృష్ణుని పాత్ర ద్వారా 5వ ఏటనే రంగస్థలంపై అడుగిడిన రాజబాబు నెల్లూరు గోవిందరాజన్ వద్ద శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొంది 1974లో పద్య నాటక రంగంలో హార్మోనియం చేతబట్టి కళాకారులైన తన తల్లిదండ్రులకే తొలుతగా సహకరించి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఉద్దండులైన ఎందరో నటీనటులకు సంగీత సహకారమందిస్తూ గుమ్మడి జైరాజ్ కు వ్యక్తిగత హార్మోనిస్టుగా ఉండి రంగస్థలంలో తన ప్రత్యేకతను చాటుకుంటూ నటీనటుల కీర్తిని ఇనుమడింప చేసిన రాజబాబు రంగస్థల సంగీత పారిజాతం అని శ్లాఘిస్తూ ప్రసంగించారు. అటువంటి వారికి అవార్డులు ప్రదానం చేయటం ఎంతో సముచితమన్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే తాతయ్య

విశాలాంధ్ర -జగ్గయ్యపేట : పట్టణంలోని ఊర చెరువు బుద్ధ విహార్ వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్ ను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నట్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మున్సిపల్ అధికారులు,టిడిపి నాయకులు తో కలిసి ఊర చెరువు ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల చెరువులో ని నీటిలో విపరీతంగా పెరిగిన తూటు కాడ ను తొలగించడం జరిగిందని తొలగించిన తూటుకాడను వాకింగ్ ట్రాక్ పై పడ వేయటంతో వాటిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఊర చెరువు వాకింగ్ ట్రాక్ ను అభివృద్ధి చేయడంతోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాకింగ్ ట్రాక్ కు రెండువైపులా ఆహ్లాదకరంగా పచ్చదనాన్ని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మున్సిపల్ వాకింగ్ ట్రాక్ ను దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, ఇర్రీ నరసింహారావు, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు,కర్ల జోజి, తమ్మిశెట్టి నరసింహారావు, సతీష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

మైలవరం మండలం మైలవరం గ్రామంలో ఆర్‌సిసి కట్టడములు కలిగిన నివేశన స్థలమునకు సంబంధించి వెంగళ వాణి ప్రణీత (తండ్రి పేరు లేటు శ్రీరామకృష్ణ)కు చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజులు (డాక్యుమెంటు నెం.11687/2024) తీసుకుని విస్సన్నపేట గ్రామంలో బైక్‌పై వెళుతుండగా, పోయినవి. ఇవి దొరికిన వారు సదరు సమాచారం ఈక్రింది చిరునామాకు తెలిపిన ఎడల తగిన బహుమతి ఇవ్వబడును.

సామినేని నాగరాజు
(తండ్రి పేరు జనార్ధనరావు)
డోర్ నెం.16-198, మైలవరం గ్రామం
మైలవరం మండలం - ఎన్టీఆర్ జిల్లా

పీఎఫ్‌లు ఇవ్వకపోతే సమ్మె చేస్తాం

విశాలాంధ్ర-గుడివాడ : 4 ఏళ్లుగా పిఎఫ్, ఈఎస్ఐ లకు కార్మికుల జీతాలలో నుండి వసూలు చేస్తు వాటిని జమ చేయకుండ కార్మికులను మోసం చేస్తున్న సఫాయి కాంట్రాక్టర్‌ను వద్ద నుండి వసూలు చేయాలని లేని పక్షంలో సమ్మెకు సిద్ధమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికులు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. శనివారం అన్నే నరసింహారావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఏఐటియుసి అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికులు వద్దాది రమణమ్మ, కనుమూరి విజలక్ష్మీ, వెల్పూల ధనలక్ష్మీలు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వం ఆసుపత్రుల కార్మికుల కాంట్రాక్టును చేస్తున్న కాంట్రాక్టర్ 4సం॥ల నుండి పిఎఫ్‌లు, ఇఎస్ఐలు చెల్లిస్తున్నట్లు నమ్మ బలికి కట్టకుండ మోసం చేస్తునట్లు తెలిపారు. తక్షణమే పిఎఫ్, ఈఎస్ఐలను కట్టించాలని లేని పక్షంలో దశల వారిగా నిరసనలు తెలిపి, ఈ నెల 17 నుండి సమ్మె చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.కోటేశ్వరమ్మ, రాజేశ్వరీ, నాగాంజనేయులు, సుబ్బయ్య, మాతంగి మేరిమ్మ, తేరెజమ్మ, మణిమ్మ, చింతలమ్మ, అలింభీ, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పది నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ప్రతి సంఘానికి 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా వారిలో ఇద్దరినిఅధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. 157 కోసూరు నీటి వినియోగదారుల సంఘాల్లో 12 మంది డైరెక్టర్లకు9మంది స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నుకోగా.టి.సి నెంబర్ 9,10, 12 (కాజ)స్థానాలకు పోటీ చేయడానికి రైతులు రాకపోవడంతో ఆ మూడింటిలో ఎన్నికలు జరగలేదని ఎన్నికల అధికారి ఎన్ శివ శంకర్రావు (ఎంఈఓ-1) తెలిపారు. ఈ సంఘంలో 9 మంది నుంచి అధ్యక్ష ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు.

లోక్ అదాలత్‌లో 213 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లాలోనిమొవ్వజుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ ద్వారా 213 కు పైగా కేసులను పరిష్కరించారు. న్యాయమూర్తి పి రాజన్ ఉదయ్.ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో చల్లపల్లి ఘంటసాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 70 చొప్పున 140, కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 37, మొవ్వ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 36 కేసులకు రాజీమార్గం ఏర్పడి పరిష్కారమయ్యే పరిష్కారమయ్యాయని ఆయా స్టేషన్లో సిబ్బంది వెల్లడించారు. న్యాయవాదులు గొర్రెపర్తి శ్రీనివాసరావు, మారం మారం సరస్వతి.పి. రాధాకృష్ణ, చల్లపల్లి ఎస్ఐ వై వి వి సత్యనారాయణ, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

ఏకగ్రీవంగా నీటిసంఘాల అధ్యక్షుల ఎన్నికలు

విశాలాంధ్ర-కృత్తివెన్ను: మండలంలోని నీటి సంఘాల అధ్యక్షులను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసిల్దార్ సోమేశ్వరం శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ఎన్నికల కార్యక్రమం ఆయా నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించారు. ప్రతి సంఘం నుండి 12 మంది సభ్యులను ఎన్నుకోగా అందులో ఒకరిని అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకున్నారు. చిన్నపాండ్రాక అధ్యక్షుడిగా పడవల రామకృష్ణ, మునిపెడ అధ్యక్షులు తోట నాగబాబు, నీలిపూడి అధ్యక్షుడిగా పాశం నాగమల్లేశ్వరరావు, కోమళ్ళపూడి అధ్యక్షుడిగా కూనసాని శ్రీనివాసరావు, కృత్తివెన్ను అధ్యక్షుడిగా నెక్కంటి విజయ భాస్కరరావు, చందాల అధ్యక్షుడిగా యాళ్ల రాజబాబు, గరిశపూడి అధ్యక్షుడిగా బొర్రా ఏడుకొండలు, లక్ష్మీపురం అధ్యక్షుడిగా బొడ్డు ఏసుబాబును ఎన్నుకున్నట్లుగా ఆయన తెలిపారు. ఈనెల 17వ తేదిన న డిసి చైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

సాగునీటి సంఘ మండల ఎన్నికలు ఏకగ్రీవం: చలసాని

విశాలాంధ్ర-పెదపారుపూడి : సాగు నీటి సంఘ మండల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ లు శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ పెదపారుపూడి నీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ, భూషణగుళ్ల నీటి సంఘం అధ్యక్షుడు చలసాని నవీన్ చౌదరి, వెంట్రప్రగడ నీటి సంఘం అధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాసరావు (శ్రీను), దోసపాడు నీటి సంఘం అధ్యక్షుడు గుండపునేని శ్రీనివాసరావు (స్వామి), మోపర్రు నీటి సంఘం అధ్యక్షుడు ఉజ్జినేని చంద్రశేఖర రావు (బుజ్జి), యలమర్రు నీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

వైద్యశిబిరంలో ఉచిత సేవలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పెద్దఎత్తున రోగులకు వైద్యులు సేవలందించారు. తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ నెక్కలపు వెంకటేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించగా, లయన్స్ జిల్లా ప్రముఖులు ఎన్.టి.వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా నాయకులు నెక్కళపు శ్రీనివాసరావు, ఆకుల రాధాకృష్ణ, చైతన్య ఆసుపత్రి చైర్మన్ డా.ఎన్.చైతన్య తదితరులు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన ఆస్టర్ రమేష్ ఆసుపత్రి, విస్సన్నపేట చైతన్య ఆర్థోకేర్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

విశాలాంధ్ర-వీరులపాడు: సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి జుజ్జూరులోని 84వ నెంబర్ టిసిలో 12 మంది మెంబర్లకు పదినామినేషన్లు వచ్చాయని, దీంతో మండల పరిధిలో ఉన్న మొత్తం 132 టీసీలకుగాను 130 నామినేషన్లు మాత్రమే రావడంతో టిసి మెంబర్లు మొత్తం ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్, ఎన్నికల అధికారి అయిన షేక్ హుస్సేన్ తెలిపారు. ఈ ఎన్నికలను పర్యవేక్షించేందుకు రూరల్ వాటర్ స్కీం ఏఈ రాజేష్ ను ప్రభుత్వం నియమించిందని, మండల పరిధిలో ఉన్న ఊర చెరువులు, పంపింగ్ స్కీములు మొదలగు 8 మైనర్ ఇరిగేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ లను, అదేవిధంగా 7 మేజర్ నీటిపారుదల సంఘాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను ఎన్నికునేందుకు ఈ ఎన్నికల ప్రక్రియ జరిగిందని, ఈరోజు ఎన్నికైన మేజర్ నీటిపారుదల సంఘాల ప్రెసిడెంట్లు ఈ నెల 17వ తేదీ మంగళవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నందు జరిగే ఎన్నికల ప్రక్రియలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ జి అనిల్ తమ సిబ్బందితో మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

మండలంలో 12 నీటి సంఘాలకు ఎన్నికలు

విశాలాంధ్ర-వత్సవాయి: మండలంలో మొత్తం 12 నీటి సంఘాలు ఉండగా వాటిలో మేజర్ ఏడు మైనర్ నాలుగు మీడియం ఒకటి ఈ 12 సంఘాలకు ఆ గ్రామాల్లో అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ఎన్నికలు మొత్తం కూడా ఏకగ్రీవం అయ్యాయి ఇందులో మొత్తం 112 మంది టిసి సభ్యులు ఉన్నారు. వీరిలో చిన్న మోదుగపల్లి ప్రెసిడెంట్ గా అలస కాని నవీన్ వైస్ ప్రెసిడెంట్ గా కోటేశ్వరరావు మంగొల్లు మన్నే నారాయణ, నరసింహారావు భీమవరం మహాబూ ఏడుకొండలు డబ్బాకుపల్లి పెంటె ల వెంకటేశ్వర్లు బట్టు నాగమల్లేశ్వరరావు వేముల నర్వ చిట్టూరి సుభాష్ మహా లక్ష్మయ్య వత్సవాయి కంభంపాడు చావా శాంత బాబు కొమ్మినేని శ్రీనివాసరావు లింగాల లక్ష్మీనారాయణ కరుణాకర్‌రావుచ పోలంపల్లి చిట్యాల రామయ్య హనుమంతరావు కన్నెవీడు పరమయ్య తిరుపతిరావు మొదలగు గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక తహసిల్దార్ నరసింహారావు మరియు ఎంపీడీవో భరత్ స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు పటిష్టంగా నిర్వహించారు

17న పెన్షనర్ డే

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 17 న పెన్షనర్ దినోత్సం సందర్భంగా బుద్దవరం రోడ్డులో గల రిటైర్డ్ ఉద్యోగుల భవనం లో పెన్షనర్ డే నిర్వహిస్తున్నామని గన్నవరం నియోజకవర్గ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు తెలిపారు. ముఖ్య అతిధిగా రాష్ట్ర జె ఎ సి నాయకులు బొప్పారాజు వెంకటేసుర్లు పాల్గొంటారు. పెన్షనర్ సమస్యలు ఇటీవల జరిగిన పరిమనలపై మాట్లాడుతారు. గన్నవరం రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనలని ఆయన కోరారు.

ఘంటసాల నీటి సంఘం ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఘంటసాల : ఘంటసాల 188 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎండీ మోమిన్, సహాయ ఎన్నికల అధికారి తాడేపల్లి జయలక్ష్మి లు ఉదయం టిసి సభ్యులుగా ఎన్నికైన అభ్యర్థులకు ఫామ్ - 10 ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందనలు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు జరిగిన ఘంటసాల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష ఎన్నికల్లో సభ్యులు అధ్యక్షునిగా అయినపూడి భాను ప్రకాష్ (ఘంటసాల), ఉపాధ్యక్షులుగా పర్వతనేని రామకృష్ణ ప్రసాద్ (రామనగరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, టీడీపీ నేతలు బండి పరత్పరరావు, వేమూరి సాయి వెంకటరమణ, గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటిబాబు), వేమూరి రమేష్, యార్లగడ్డ వీరభద్రరావు, టెంట్ బాషా, ఇతర నేతలు, కార్యకర్తలు అభినందలు తెలియజేయడంతో పాటు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

వైభవంగా ఏకశిలా నాట్య స్థూపం ప్రతిష్ఠ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడిలో శనివారం పండితుల మంత్రోచ్ఛరణలమధ్య సాంప్రదాయ మంగళ వాయిద్యాలనడుమ నిష్ణాతులైన నాట్యాచార్యులు, యువ కళాకారులు పర్యవేక్షణలో 50 అడుగుల ఏకశిలనాట్య స్థూపాన్ని క్రేన్ల సాయంతో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి శంకుస్థాపన చేసి ప్రతిష్టా కార్యక్రమం కొనసాగించారు. ఈనెల 27 నుంచి మూడు రోజులు నిర్వహించే కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఆవిష్కరించే ఈస్థూప ప్రతిష్టను ఉత్సవ కమిటీ చైర్మన్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న ఆచార్య పసుమర్తి రామలింగ శాస్త్రి సూచనలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్, ప్రవాస భారతీయులు డాక్టర్ వేదాంతం వెంకట నాగచలపతిరావు (వెంకు), రాష్ట్రపతి అవార్డు గ్రహీత నాట్యాచార్య, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతరవి బాలకృష్ణ, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పాలక మండలి అధ్యక్షుడు కావూరి భానుమూర్తి, కూచిపూడి నాట్య హెరిటేజ్ సొసైటీ నిర్వాహకులు, యువ నాట్యా చార్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు. అమెరికా దేశపు రాజధాని వాషింగ్టన్ డి.సి.లో భారత దేశ దౌత్య కార్యాల యం, కూచిపూడి కళానిలయం (అమెరికా) కూచిపూడి వారసత్వ కళా సంస్థ (కూచిపూడి) ల సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి పతాక సంవత్సర వేడుకలను నిర్వహించారని ప్రవాస భారతీయ నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం వెం కట నాగ చలపతిరావు కూచిపూడి లో విలేకరుల కు తెలి పారు. వేదాంతం చిన్మయ సింధు, యామిని లక్ష్మీబాయి, కృష్ణవేణి, అమేయ, భారతీయ దౌత్య కార్యాలయ అధికారుల బృందం పర్యవేక్షించారు. కూచిపూడినాట్య చిహ్నమైన చెరుకు గలతో కూడినపతాకాన్నిప్రదర్శించి కూచిపూడి కి సముచిత స్థానం కల్పించారని ప్రస్తావించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం



విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో అతిపెద్ద చెరువుగా ఉన్న కలగర కుందపాలెం చెరువు సాగునీటి సంఘం ఎన్నిక సమస్యాత్మకంగా మారటంతో ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన ఎంపీడీఓ చిన్నరాట్నాలు అప్రమత్తంగా వ్యవహరించి, ఎన్నికలను ప్రశాంతంగా ముగించారు. శనివారం సాయంత్రం నాటికి మండలంలోని 23 నీటిసంఘాలకు సంబంధించిన ప్రాదేశిక సభ్యుల ఎన్నిక ప్రశాంతంగా ముగియగా, అధికారులు అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలు ప్రారంభించారు.

పోతినేని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి: చినకాకాని లోని పైన్ అనాథాశ్రమంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలబాలికల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోతినేని శ్రీనివాసరావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి రాయపాటి విజయకుమార్, వెస్పా షోరూం అధినేత వాసిరెడ్డి సురేష్, మల్లూరి మహేష్, నన్నూరి గౌరీశంకర్, అల్లూరి నాగ మాధవ్, రాయని భూమేశ్వరరావు, ఆర్.రవితేజ, నందూరి పురుషోత్తం రాజు, నందనం విజయ్ కుమార్, ఎస్.మహిమ, జి.బుజ్జిబాబు, పి.బాబీ, ఆర్.వెంకట రమణ, జి.రమణ, పి.మణికంఠ, శివ పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన, పోటీలు

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని గరికపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశుసంవర్ధక-పశుగణాభివృద్ధి శాఖ సంయుక్తంగా శనివారం మండల పశువైద్యాధికారి బి.శేఖర్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతి థిగా పాల్గొన్న ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ కేశవరావు పాల్గొని ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించిన దూడలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద ఇంజక్షన్లు అన్ని పశువైద్య కేంద్రాలలో లభిస్తున్నాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు. తద్వారా మేలైన దూడలు జన్మిస్తాయని, పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు శైలజ, చిన్నగోస్ ఖాన్, పాడిరైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పలు దొంగతనాల కేసులలో ముద్దాయిగా ఉన్న పెరికల సాగర్‌ను కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ లెనిన్ నగర్‌కు చెందిన పెరికల సాగర్ ప్రస్తుతం గుంటూరు శ్రీనివాసరావుపేటలో నివాసం ఉంటున్నాడన్నారు. గుంటూరు కొత్తపేట పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో జరిగిన దొంగతనం కేసులో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కొత్తపేట సిఐ ఎం.వీరయ్య పర్యవేక్షణలో కొత్తపేట ఎస్సైలు రమేష్, తరంగిణి వారి సిబ్బంది సహాయంతో ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురు రోడ్డులో ముద్దాయి సాగర్‌ను అరెస్టు చేశారు. సుమారు రూ.10.50 లక్షల విలువైన 11 బైక్‌లు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిను పట్టుకోవడంలో, సమాచారం సేకరించడంలో ప్రతిభ కనబరిచిన సిఐ ఎం.వీరయ్య, ఎస్సైలు డి.రమేష్, కె.తరంగిణి, ఏఎస్సై ఎం.ఆంథోని, హెచ్‌సిలు కె.కోటేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, పీసీలు ఎన్ఎస్ఆర్ కోటేశ్వరరావు, డేగల కోటేశ్వరరావు, టి.అనిల్‌కుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు నల్లపాడులో ఈ నెల 15న సాయంత్రం 4 గంటలకు జరిగే మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాలల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్, వైస్ చైర్మన్ గుర్రం రామారావు సంయుక్తంగా పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దేవిప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా జరిగే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో అనేక సమస్యలు వస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ముందుగా కుల గణన చేసిన తర్వాత జనాభా ఉపాధి ఉద్యోగ అవకాశాలు పరిశీలించి వర్గీకరణ చేయాల్సి వస్తే అప్పుడు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జేఏసీ వైస్ చైర్మన్ గుర్రం రామారావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాలు కులాలను విడగొట్టి రాజకీయ లబ్ధి కోసమే ఈ వర్గీకరణ చేస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి మాలలు మద్దతు ఇవ్వటం వలన అధికారంలోకి వచ్చిందన్నారు. ఇది ఇలా ఉండగా ఎస్సీ వర్గీకరణ అనంతరమే డీఎస్సీ ప్రకటిస్తాం అనటం సరికాదని వెంటనే డీఎస్సీకి అనుమతి ఇవ్వాలని మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్ కుమార్ నాగేశ్వరరావు మేరుగ, జేఏసీ కన్వీనర్ టి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు మరో న్యాయమా..?

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గతంలో అనేక మంది హీరోల కోసం ఎగబడిన అమాయక అభిమానులు మరణించిన సంఘటనల్లో ఏ హీరో పైన పోలీసుల కేసులు పెట్టిన దాఖలాలు లేవని రాజకీయ విశ్లేషకులు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. కానీ నేడు అల్లు అర్జున్ విషయంలో తెర వెనుక నుండి చక్రం తిప్పుతున్నది ఎవరు ? వ్యూహకర్తగా పేరు గాంచిన అల్లు అరవింద్‌కు తెలియదా ?అని ప్రశ్నించారు. అల్లు అర్జున్‌కు శత్రువులు కోటలోనా ? లేక పేటలోనా ? అనే అనుమానాలు అల్లు అభిమానులను వెంటాడుతున్నాయన్నారు. న్యాయపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించిన తదుపరి అల్లు అర్జున్‌పై సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కేసు పెట్టిందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని, అల్లు అర్జున్‌పై నమోదైన క్రిమినల్ కేసులో ఎవరికి మేలు జరుగుతుంది. ఎవరి అక్కసు సంతృప్తి చెందుతుంది అనేది ఎవరికీ అంతుపట్టని ప్రశ్న అన్నారు. నేటి సినిమా హీరోలకు రాజకీయ గ్రహణాలు వెంటాడుతున్నాయామో అనే సందేహాన్ని వెలుబుచ్చారు.

పవన్ సీఎం కావాలని పాదయాత్ర

విశాలాంధ్ర-పెదనందిపాడు : బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన వంకాయలపాటి రవివర్మ పవన్ కళ్యాణ్ సీఎం కావాలని విజయవాడ కనకదుర్గమ్మ దర్శనార్థం పాదయాత్ర చేస్తూ శనివారం పెదనందిపాడు చేరుకున్నారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించిన జనసేన పార్టీ 2029 ఎన్నికలలో పవన్ కళ్యాణ్ సీఎం కావడానికి దోహదపడుతుందని ఆశాభావంతో ఈ పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం కావడానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రవివర్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ డిపోలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తెనాలి : ఆర్టిసి డిపోను జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు శనివారం తెనాలి సందర్శించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. మధ్యలో ఉండే పికప్ పాయింట్లలో ఆపుకొని వెళ్లుటకు అవకాశం ఉంటుందని, తద్వారా ఆ రూట్‌లో పాసింజర్లను ఎక్కువమందిని ఎక్కించుకోవచ్చని తెలిపారు. సమయపాలన మాసోత్సవాలు ఒక నెల కాదని, అది నిరంతర ప్రక్రియని తెలిపారు. అన్ని సర్వీసులు సమయపాలన పాటించాలని అది మన కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌టిసికి అత్యధిక ఆదాయం సమకూర్చిన ముగ్గురు కండక్టర్లకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. గ్యారేజి నుండి ఎసి మెకానిక్ వి.జోషిబాబు అన్‌కాల్ డ్రైవర్ అత్యధిక (కెయంపిఎల్) తీసుకువచ్చిన కె.యస్.కృష్ణలను అభినందించి ప్రశంసా పత్రం, పారితోషకం అందజేశారు. గుంటూరు డిపిటిఓ యం.రవికాంత్ విచ్చేసి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐ.జయప్రసాదరావు, అభిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగి హఠాన్మరణం

విశాలాంధ్ర-దాచేపల్లి : గామాలపాడు సిమెంటు పరిశ్రమలో ఒక ఉద్యోగి శనివారం మృతి చెందారు. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన నిరంజన్(39) రాడ్ బెండింగ్ కార్మికునిగా చేస్తున్నాడు. అయితే విధి నిర్వహణలో ఉన్న ఆయన హఠాత్తుగా మృతి చెందారు. దాంతో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సౌందర్ రాజన్ తెలిపారు.

నేటి నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

విశాలాంధ్ర-మంగళగిరి : బైపాస్ రోడ్డు బాపూజీ విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 16వ తేది నుంచి జనవరి 13వ తేది వరకు నెల రోజుల పాటు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వైటీఆర్ ట్రస్ట్ చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం బాపూజీ విద్యాలయం అవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. తులసీరామ్ యాదవ్ మాట్లాడుతూ మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య అశీస్సులతో అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ధనుర్మాస వ్రత మహోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, గీతాలాపన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో జరుగుతాయని, ఈ నెల 16వ తేది సాయంత్రం 4 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమౌతాయని అన్నారు. లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ అమరావతి రాజధానిలో ధనుర్మాత మహోత్సవాలు నిర్వహించటం సంతోషకర విషయం అన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొంటారని గంగరాజు తెలిపారు. నెల రోజుల పాటు జరిగే మహోత్సవంలో ప్రతి రోజు 15 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ, తీర్థ ప్రసాదాలు అందజేస్తాన్నారు. ఈ సమావేశంలో క్రేన్ సంస్థ చైర్మన్ గ్రంధి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సెక్రటరీ సదిమేల శ్రీకూర్మానాధస్వామి, సీతాన గరం జీయర్ ఆశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటార్యులు, మధుసూధన చార్యులు, సధిమేల రఘునాథ్, రిటైర్డ్ డీఐజీ వెంకటస్వామి, ధ్యాన మండలి ప్రతినిధులు ఆకురాతి శంకరరావు, లక్ష్మీ, వికాస మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ళ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పొన్నూరు శాసన సభ్యులు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలు జిల్లా పార్టీ కార్యాలయంలో శని వారం ఘనంగా జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు దాసరి రాజామాష్టారు, మద్దిరాల ఇమ్మా న్యుయేల్ తదితరులు హాజరై కేక్ కట్ చేసారు. వారు మాట్లాడుతూ ధూళిపాళ్ళ నరేంద్ర ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ నాయకులు మానుకొండ శివప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, వడ్రాణం హరిబాబు, కంచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ళకు కాళహస్తి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పుట్టిన రోజు సందర్భంగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ, పీఏఎస్ కాలేజీ చైర్మన్, అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ గుంటూరులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ళను శాలువా, వాల్‌నట్‌లతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాళహస్తి మాట్లాడుతూ భవిష్యత్‌లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రాజకీయంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను ప్రయాణిస్తున్న రంగంలో అనేక రకాలుగా పేదలకు సేవలందించాలని కోరారు.

జేఎంజే కళాశాలను సందర్శించిన ఎన్ఏఏసీ టీమ్

విశాలాంధ్ర-తెనాలి : జేఎంజే కళాశాలలో శనివారం ఎన్ఏఏసీ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సభ్యులు ప్రొ.గాదంగి ఇందిర, చైర్‌పర్సన్, వైస్‌చాన్సలర్ రాఫెల్స్ యూనివర్సిటీ అల్వార్, రాజస్థాన్, ప్రొ.డా.జి.బ్రిందా, మెంబర్ సెక్రటరి మానేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, యంజిఆర్ యూనివర్సిటీ తమిళనాడు, డా. సెబాస్టియన్ కరొట్టుపురం మెంబర్, ప్రిన్సిపాల్ డాన్‌బాస్కో కాలేజి, మణిపూర్ వారు పరిశీలించారు. కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల బోధనా విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ, ల్యాబ్‌లు, తరగతి గదులు, రిజిష్టర్లను పరిశీలించి అభినందించారు. భోజన, వసతి సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వారు తమ స్వీయ అధ్యయన నివేదికలో జెయంజె విద్యాసంస్థ అందించిన గుణాత్మక కొలమానాల సూచనతో ఇనిస్టిట్యూట్‌ను ధృవీకరించడం, అంచనా వేయడం జరిగింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ డా.సిస్టర్ థెరిస్సమ్మ గాదె, ప్రిన్సిపాల్ డా.సి.షైనీ కె.పి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ యం.అరుణ, ఎన్ఎఎసి కోఆర్డినేటర్ పి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం అధ్యక్షుడిగా పోతినేని వేణు

విశాలాంధ్ర-కాకుమాను : కాకుమాను మేజర్ కాలువ నీటిసంఘం అధ్యక్షుడిగా పోతినేని వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులుగా పేర్నేని సాంబశివరావు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నీటి సంఘాలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-యద్దనపూడి: మండల పరిధిలో గల మూడు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. జాలాది సాగునీటి సంఘం ఎన్నికలు ఆ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. అధ్యక్షులుగా పోపూరి రాఘవయ్య, ఉపాధ్యక్షులుగా గొట్టిపాటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంపీడీఓ హేమలతాదేవి విజేతలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఉన్నవ నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులుగా ఇడుపుల పాటి సాయిబాబు, ఉపాధ్యక్షులుగా నమ్మినేని సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఈఓపీఆర్డీ జాకీర్ హుస్సేన్ వ్యవహరించారు. వంకాయలపాడు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మద్దూరి శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వ్యవసాయ శాఖాధికారి శాంతి ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.

వైభవంగా జ్యోతి ప్రజ్వలన

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక ఏనుగుపాలెం రోడ్డు లోని మిర్చి యార్డు పక్కన అన్నదాన ప్రభువైన శ్రీశ్రీశ్రీ కాశీనాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా శనివారం వినుకొండ ఆశ్రమంలో మార్గశిర శుద్ధ చతుర్దశి పౌర్ణమి గడియాలలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే ఆశ్రమంలో కాశీనాయనకు ప్రత్యేక పూజలు, మహిళా భక్తులతో సత్సంగం పారాయణం భజన ఆవరణలో నిత్య అన్నదానంలో 24 గంటలపాటు 108 వంటకాలతో వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. రాత్రికి బ్రహ్మంగారి పూర్తి నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తిగా భక్తుల విరాళాలతో నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-దాచేపల్లి : రాష్ట్రంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా తంగెడ మేజరు కాల్వ పరిధిలోని 12 సంఘాల్లో శనివారం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోటీ నామినేషన్లు లేకపోవడంతో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. 26వ సంఘం అధ్యక్షునిగా ఆకురి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షునిగా సయ్యద్ మౌలాలీ, 45వ సంఘానికి బండి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, 47వ సంఘానికి పగడాల భాస్కరరావు, పసుపులేటి నరసింహస్వామి, 48వ సంఘానికి పొతక మూరి ఫణీంద్ర కుమార్, యర్రబెల్లి చిన్న సైదులు, 49వ సంఘానికి షేక్ యంపర్ల హుసేన్, గోళ్ళ సైదులు, 50వ సంఘానికి చింతపల్లి మొహమ్మద్ గౌస్, సుద్దపల్లి సూర్యచంద్రరావు, 52వ సంఘానికి పాశం చిన్న వెంకటరెడ్డి, తోట వెంకటేశ్వర్లు, 58వ సంఘానికి సొంటెం శివనాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, 59వ సంఘానికి చిన్నం రాజ్యలక్ష్మి, భూక్యా శంకర్ నాయక్, 25వ సంఘానికి బండి కాంతారావు, సంగా వీరాంజనేయులు ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షుని సహా మేజరు సంఘానికి 12 మంది, మైనరు సంఘానికి ఆరుగురు సభ్యులు ఉంటారు. 46వ సంఘానికి అధ్యక్షులుగా కర్నాటి నరేంద్ర, ఉపాధ్యక్షునిగా మునగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. డీసీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 17న జరుగనుంది. అయితే దాచేపల్లికి చెందిన టీడీపీ నేత పగడాల భాస్కరరావుకు డీసీ చైర్మన్‌గా పార్టీ ప్రకటించింది. భారీ ఊరేగింపుతో నామినేషన్ వేసిన భాస్కరరావును ముందస్తుగా పార్టీ శ్రేణులు అభినందించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రజా ఉద్యమాల రథసారథి భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు ఉద్యమాల పురిటిగడ్డపై ముమ్మరంగా జరుగుతున్నాయి. 1925లో ఆవిర్భవించిన సీపీఐ భారతావని ప్రజా సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన నిలిచింది. 1940 ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మహత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపింది. తద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టిన ఘనత ఎర్ర జెండాకు దక్కింది. ఈ పోరాటంలో 4500 మందికిపైగా కమ్యూనిస్టులు ప్రాణాలొదిలారు. దీనిలో భాగంగానే 1950 ప్రాంతానికి పూర్వం నుంచే కార్మిక, కర్షక రాజ్యం కోసం పోరాడిన ఎంతో మంది ప్రభుత్వ తుపాకీ గుండ్లకు అశువులు బాశారు. వారందరి గుర్తుగా నారాయణపురంలోని సీపీఐ కార్యాలయం వద్ద 1958లోనే అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించారు. అందులో అశువులు బాసిన షేక్ అబ్దుల్ రసూల్ పేరుతో దాచేపల్లిలో పార్టీ కార్యాలయాన్నీ కూడా నిర్మించారు. ఈ నెల 26న అక్కడి నుంచి నారాయణపురం స్థూపం వరకు వందలాది మంది ప్రజా ప్రదర్శన చేయనున్నారు. అనంతరం మండపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్లో బహిరంగ సభ నిర్వహిస్తారు. దీనికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొంటారు. అదేవిధంగా పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కోలా స్వాతి, పార్టీ మాచర్ల, గురజాల నియోజకవర్గాల కార్యదర్శులు మేకపోతు శ్రీనివాసరెడ్డి, మండపాటి రమణారెడ్డి, పార్టీ దాచేపల్లి మండల కార్యదర్శి, ఏఐటీయూసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమెర వెంకట్రావు పాల్గొంటారు. కావున పార్టీ శ్రేణులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు హాజరు కావాలని నిర్వాహకులు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, వేముల వెంకటరెడ్డి కోరారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

విశాలాంధ్ర-ఈపూరు : మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 11 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్య క్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొచ్చెర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నెల్లూరి శాంతారావు, ఉపాధ్యక్షుడిగా నిశ్శంకరరావు రామారావు, కొండ్రముట్ల-1 అధ్యక్షుడిగా గడిపూడి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా సూరా పెదపెంచల రెడ్డి, కొండ్రముట్ల-2 అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కందుల లక్ష్మీరెడ్డి, కొండ్రముట్ల-3 అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బోడపూడి శ్రీనివాసరావు, చిట్టాపురం అధ్యకుగా మెట్టెల వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడిగా కామని రామయ్య కొండాయపాలెం అధ్యక్షుడిగా వెంపటి సీతయ్య, ఉపాధ్యక్షుడిగా గోగుల సుబ్బయ్య, ముప్పాళ్ళ-1 అధ్యక్షుడుగా లింగా ప్రసన్నాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా గోనుగుంట్ల రామయ్య, ముప్పాళ్ళ-2 అధ్యక్షుడిగా పులుకూరి నాగార్జున, ఉపాధ్యక్షుడుగా మద్దినేని ఫణీంద్ర, అగ్ని గుండాల అధ్యక్షుడుగా ఘంటా సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా దూదేకుల హుస్సేన్, బొగ్గరం అధ్యక్షుడుగా వడ్లమూడి వీరయ్య, ఉపాధ్యక్షుడుగా వడ్లమూడి నాగేశ్వరరావు, ఈపూరు అధ్యక్షుడుగా కాట్ల హనుమంతురావు, ఉపాధ్యడుగా గోవిందులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి ధృవీకరణ పత్రాలను ఎన్నికల అధికారులు, తహశీల్దారు నళిని అందజేశారు.

కార్లు ఢీ.. పసిపాప మృతి

విశాలాంధ్ర-ఈపూరు : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని పసిపాప మృతి చెందిన సంఘటన మండలంలోని ఈపూరు కుచనపల్లి గ్రామాల రహదారి మధ్యన శనివారం జరిగింది. ఈపూరు సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా అతివేగంగా వస్తూ ఢీ కొనడంతో చిన్న పాప ఆరాధ్య(2) మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈపూరు ఎస్సై ఉమామహేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి వినుకొండ పోయే కారు, వినుకొండ నుంచి కారంపూడి వైపు వెళ్లే కారు ఈపూరు, కూచనపల్లి మధ్యలో ఎదురుగా అతివేగంగా వస్తు ఢీకొన్నాయ న్నారు. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించామన్నారు. ప్రమాదంలో దెబ్బతిన్న రెండు కార్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

సత్ప్రవర్తనతోనే అద్భుత విజయాలు: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ: నేర్చుకునే మంచిని ఇలా విని అలా వదిలివేయడం కాకుండా అర్థం చేసుకుని, అమలు చేసే వారే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరతారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. చదువుకు విలువలు, ఆశయాలు, మంచి ప్రవర్తనను అలవరుచుకునే వారికి అద్భుతవిజయాలు వరిస్తాయన్నారు. వినుకొండలోని ఇంటర్ విద్యార్థులకు శనివారం గంగినేని ఫంక్షన్ హాల్‌లో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సినీ నటుడు, ప్రముఖ స్ఫూర్తి వక్త కేవీ ప్రదీప్ ముఖ్య అతిథిగా పాల్గొని విలువలు, వికాసం, నాయకత్వ లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. మోటివేషనల్ స్పీకర్స్ రావులపల్లి పుల్లారావు, మొలకా గోవర్ధనుడు, గజపల్లి వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు రావులపల్లి పుల్లారావు రచించిన గెలుద్దాం పదా..? పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ కళాశాలల నుంచి 2 వేలమందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వవికాసంలో ఆదిగురువులు అమ్మానాన్నలే అన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి అప్పులు, కష్టాలకు ఎదిరీది తాను గెలిచిన జీవితం పాఠాలు నేర్పింది కూడా అదే అని తెలిపారు. 15 రాష్ట్రాల్లో వ్యాపారాలు, 5వేల మంది ఉద్యోగులు ఉన్నా... జన్మభూమి రుణం తీర్చుకుందామని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. జీవితంలో ఎవరైనా మంచి చెబితే వినాలని, తన వరకు అయితే 100లో మంచిని వినడం, అర్థం చేసుకోవడానికి 1మార్కు, నేర్చుకున్నది, తెలుసుకుంది అమలు చేయడానికి 99 మార్కులు వేస్తానంటూ స్ఫూర్తి పాఠాలు చెప్పారు. కేవీ ప్రదీప్ మాట్లాడుతూ నమ్మకంతోనే ఏదైనా సాధ్యమన్నారు. చదువుతో నేర్చుకునే విజ్ఞానమే మనకు పెట్టుబడి అని గుర్తు పెట్టుకోవాలని, ప్రవర్తన, నైపుణ్యం, జ్ఞానం, స్థిరత్వం, లక్ష్యం, సంకల్పం, ప్రయత్నం ఇవే విజేతలను ముందుకు నడిపించే తారకమంత్రాలన్నారు. సోషల్‌మీడియాలో సమయం వృథా చేయడం కంటే లక్ష్యాలను, స్వప్నాలను ఛేదించే పనిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి కళాశాల డైరెక్టర్ ఎడవల్లి శ్రీదేవి, గీతాంజలి పాఠశాల డైరెక్టర్ కిషోర్, కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ బొద్దపాటి లింగారావు, శివశక్తి ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ భాస్కర్ ఆటో కార్మికులను కోరారు. నడికుడి రైల్వే జంక్షన్ పరిధిలో ఉన్న ఆటో యూనియన్ కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ అదనపు ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం తాగి వాహనం నడిప రాదన్నారు. వీటికి భిన్నంగా ఎవరైనా ఆటోలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు పాపారావు, సౌందర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

లక్కరాజుగార్లపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రమేష్ ఎన్నిక

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: రైతు సంస్థల సాగునీటి వినియోగదారుల సంఘం 97 లక్కరాజుగార్లపాడు కమిటీ అధ్యక్షులుగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన గుంటూరు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పోతురాజు టీసి సభ్యులుగా సీనియర్ న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావుతో పాటు నంబూరి సీతారామరాజు, జంగాల మరియమ్మ, కూచిపూడి నరసింహారావు, జల్లేగ వెంకటేశ్వరరావు, కనుమూరి రామారావు, సోమేపల్లి నాగేశ్వరరావు, దాసరి రామారావు, కొలికొండ యలమంద ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, లక్కరాజు గార్లపాడు టీడీపీ నాయకులు పుట్టి సతీష్, హనుమంతరావు తుమ్మల కొండయ్యలకు అధ్యక్ష సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని నెమళ్ళగండి చెరువు (ఓబులేశునిపల్లె), ఆత్మకూరు చెరువు (ఆత్మకూరు) చెందిన సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. 2 సాగునీటి సంఘాలకు జరిగిన ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు పి.శివప్రసాద్, టి.శివ తెలిపారు. నెమళ్ళగండి చెరువు అధ్యక్షుడుగా పూనాటి భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా కిన్నెర మరియమ్మ, సభ్యులుగా బాణావతు హనుమా నాయక్, పున్నం వెంకటేశ్వర్లు, చాట్ల శ్రీనివాసరావు, సింగు అంజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆత్మకూరు చెరువుకు అధ్యక్షులుగా బూసాని లింగయ్య, ఉపాధ్యక్షులుగా గోళ్ళ శివయ్య, సభ్యులుగా గాలి గణేష్, గాలి సరవయ్య, ఆరె క్రిష్టయ్య, నామసాని మల్లయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు వీరందరికీ నియామకపు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జనని-555 బిటి-11 ప్రత్తి ప్రదర్శన

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామంలో రైతుల పొలాల్లో జనని సీడ్స్‌వారి ఆధ్వర్యంలో ప్రత్తి ప్రదర్శన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంపెనీ జోనల్ మేనేజర్ టి. వెంకటేశ్వరరావు పాల్గొని రైతులతో మాట్లాడుతూ జనని-555రకం విత్తనం అధిక వర్షాలకు, వివిధ రకాల తెగుళ్ళను సైతం తట్టుకొని గులాబీరంగు పురుగు మరియు చీడ పీడలను సమర్ధవంతంగా ఎదుర్కొని అధిక దిగుబడులను అందిస్తుందని రైతన్న దాతలకు అవగాహన కల్పించారు. ప్రదర్శన కార్యక్రమానికి ఫిరంగిపురం , మేడికొండూరు మండలాలకు చెందిన రైతులు 800మందికి పైగా పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కృష్ణనగర్, స్తంభాలగరువు, పట్టాభిపురం ప్రాంతాల్లో శనివారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే రోడ్ల నిర్మాణం డ్రైన్ టు డ్రైన్ చేయాలని, డ్రైన్లను లెవల్ సరిగా ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. డ్రైన్ల మీద నిర్మాణం చేసే కల్వర్ట్ల వద్ద మురుగు పారుదల సక్రమంగా ఉండడంలేదని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణం అనంతరం డెబ్రిస్ను తొలగించాలని, సచివాలయాల వారిగా ఎక్కడైనా రోడ్లు ప్యాచ్ వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఏమినిటి కార్యదర్శులను ఆదేశించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు రోడ్లకు ఇరువైపులా డ్రైన్ నిర్మాణం చేయాలని, ఆక్రమణదారులకు నోటీసులు అందించి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలియచేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పట్టాభిపురం మెయిన్ రోడ్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు రోడ్, డ్రైన్, శ్యామలానగర్ గేటు నుంచి డీఆర్ఎం ఆఫీస్ వైపు డ్రైన్ నిర్మాణం కోసం ప్రజల నుంచి పలు అర్జీలు అందుతున్నాయని, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, ఈఈు కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, డిఈఈ మధుసూదన్, శ్రీనివాసరావు, ఏసీపీ రెహ్మాన్, ఆర్ఓ బాలాజీ బాషా, ఏఎంహెచ్ఓ ఆనంద కుమార్, టీపీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా లేఖ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి 42 అంశాలతో లేఖ రాసినట్టు హైకోర్టు న్యాయవాది, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడానికి అసెంబ్లీలో తీర్మానం చేయాలని, సమగ్ర కుల జనగణన చేపట్టాలని, చట్ట సభలలో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేయాలని, న్యాయవాదుల రక్షణ కొరకు రక్షణ చట్టం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కోర్టులలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, న్యాయవాదులకు కోర్టులలో చాంబర్లు ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెల రూ.10 వేలు స్టైఫండ్ ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన న్యాయవాదులకు అర్హతను బట్టి నెలకు రూ.15 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పోలీసు శాఖను స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన సంస్కరణలు చేయాలని, విద్య మరియు వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని, దేవాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆహార కల్తీ, స్మగ్లింగ్, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా నివారణకు చర్యలు మరియు కఠినమైన చట్టాలు చేయాలని, 1956 నుంచి ప్రభుత్వ భూమును అన్యాక్రాంతం చేసిన వారి నుండి స్వాధీనం చేసుకుని, అన్యాక్రాంతం చేసిన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా శిక్షించాలని, మెగా డీఎస్సీలో ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి 45 కు పెంచాలని, ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి 46 కు పెంచాలని, ఏపీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో ఉద్యోగాలు భర్తీ చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు, గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థలలో బోధనా టీచర్లకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులందరికి కామన్ సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని, వాలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఇచ్చిన హామీ మేరకు 10 వేలు వేతనం ఇవ్వాలని తదితర అంశాలతో లేఖను రాసినట్టు తెలిపారు.

జీజీహెచ్‌లో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సీనియర్ సర్జన్, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, జనరల్ సర్జరీ 3వ యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్ గోవింద నాయక్‌ల బృందం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత అరుదైన ప్రెనిక్ నర్వ్ ట్యూమర్-క్లిష్టమైన అరుదైన ఆపరేషన్ చేసి విజయవంతం చేశారు. వివరాల్లోకి వెళితే మొహమ్మద్ అనే పేషంట్ యనమదల గ్రామం నుంచి గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి జనరల్ విభాగానికి ఎడమవైపు మెడ దగ్గర కణితి రావటంతో ఆ పేషంట్ జనరల్ సర్జరీ విభాగానికి వెళ్లటంతో ఆ విభాగం మూడవ యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్ గోవింద నాయక్ పరీక్షించి వివిధ పరీక్షలను చేసి అది 'లింఫ్ నోడ్' కావచ్చని స్కానింగ్‌కి పంపించారు. మెడ ఎడమ వైపున వచ్చిన గడ్డ అత్యంత అరుదైన నరం నుంచి వచ్చిన ట్యూమర్‌గా గుర్తించారు. ఈ కణితి వేగస్ నర్వ్ నుంచి వచ్చిందని గుర్తించి వేగస్ నర్వ్ నుంచి వచ్చిన 'షానోమా'గా నిర్ణయించారు. సూది పరీక్ష మొదలగు పరీక్షలు కూడా చేసి దానిని ఆపరేషన్ ద్వారా తొలగించాలని నిర్ణయించారు. మత్తు డాక్టర్లు పోలయ్య, వారి బృంద సహకారంతో ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అత్యంత కష్టమైన నేపథ్యంలో సీనియర్ సర్జన్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌తో ఆపరేషన్ చేయించారు. వేగస్ నర్వ్ అనేది కడుపులో ఉండే వివిధ అవయవాలకు నర్వ్ సప్లై చేస్తుంది. అత్యంత ప్రమాదకరమైన మేజర్ రక్త నాళాలైనర్ కేరో టిడ్ ఆర్టరీ, ఇంటర్నల్ జుగులర్ వెయిన్‌కు వెనుక భాగాన ఉంటుందని, ఈ వేగస్ నర్వ్‌కి వచ్చిన కణితిని తొలగించటం అత్యంత క్లిష్టమైనది ప్రమాదముతో కూడుకున్నది. ప్రాణ గండం ఉండే ఆపరేషన్ గడ్డ తొలగించేటప్పుడు ఏమాత్రం కెరోటి ఆర్ట్రీ ఇంటర్నల్ జ్యువలరీ వెయిన్ దెబ్బతినే అవకాశం ఉంది. ఆపరేషన్ చేసే సమయంలో ఈ కణితి వేగస్ నర్వ్ నుంచి రాలేదని గుర్తించారని, ఈ కణితి వేగస్ నర్వ్ నుంచి కాకుండా ఇంకా వెనుక వైపు ఉన్న ప్రనిక్ నర్వ్ నుంచి బేస్ ఆఫ్ ది స్కల్ దగ్గర ఉన్న ప్రనిక్ నర్వ్ నుంచి వచ్చినట్టు గుర్తించారు. దీనిని ఆపరేషన్ సమయంలో ఫ్రోజన్ సెక్షన్‌కి పంపించి పెథలజీ డాక్టర్లు క్యాన్సర్‌గా మారలేదని గుర్తించి ఫెనిక్ నార్వ్ డామేజ్ కాకుండా గడ్డను పూర్తిగా తొలగించడం జరిగింది. ఫ్రేనిక్ నర్వ్ ఆపరేషన్ అప్పుడు దెబ్బతింటే ఛాతీకి కడుపుకి మధ్యలో ఉండే డైయాఫ్రమ్ అనే కండరం దెబ్బతిని ఊపిరి తీసుకోవడం కష్టం అయ్యే అవకాశం ఉంది అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ దాదాపు 5 నుంచి 6 లక్షల రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉందని, దీనిని పూర్తిగా ఎన్టీఆర్ వైద్య సేవ స్కీంలో ఉచితముగా చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఇలాంటి అరుదైన ఆపరేషన్లు ప్రభుత్వ ఆసుపత్రిలో జరగడం గొప్ప విషయమని, జనరల్ సర్జరీ విభాగాన్ని ఆయన అభినందించారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ హేమిల, మత్తు మందు విభాగం హెచ్ఓడీ డాక్టర్ పోలయ్య పాల్గొన్నారు.

తిరుగుబాట్లు ప్రపంచానికీ ప్రమాదమే: వక్తలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'ఆఫ్ఘనిస్తాన్‌లో మొదలై ఇప్పుడు సిరియా దేశంతో సహా జరుగుతున్న తిరుగుబాట్లు ఆయా దేశాల ప్రజలకే కాదు..ప్రపంచానికి సైతం ప్రమాదకరమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చా గోష్ఠిలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఆయా దేశాల్లో తిరుగుబాట్లు-కారణాలు-పర్యవసానాలు'అనే అంశంపై చర్చ జరిగింది. విశ్లేషకులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ సరిగ్గా నాలుగు నెలల క్రితం బంగ్లాదేశ్ ప్రధాని నివాసంలో కనిపించిన దృశ్యాలే ఇవాళ సిరియా అధ్యక్ష భవనంలో కనిపి స్తున్నాయని, ప్రజాగ్రహానికి గురైన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా అధికారిక నివాసంలో తిరుగుబాటుదారులు దాడి చేసి ఇంటిని లూటీ చేసిన దృశ్యాలే సిరియా అధ్యక్ష భవనంలో రిపీట్ అయ్యాయన్నారు. సిరియా అధ్యక్షుడిగా రెండున్నర దశాబ్దాల పాటు ఆ దేశాన్ని ఏలిన బషర్ అల్ అసద్ దేశాన్ని విడిచిపోయి పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2022, జూలైలో శ్రీలంక అధ్యక్షుడు గోట జయరాజ పక్సే కూడా ఇదేవిధంగా పెట్టే బేడా సర్దుకుని ఉన్నపళంగా దేశాన్ని వదిలిపోవాల్సి వచ్చిందన్నారు. విద్యావేత్త ఎస్.రవిబాబు మాట్లాడుతూ సిరియా దేశంలో నియంతృత్వం అంతరించే సూచనలు కనుచూపుమేరలో కనిపించక పోగా ఆదేశ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులు టి.నారపరెడ్డి, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నంలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి

విశాలాంధ్ర-రెంటచింతల: గత ఐదేళ్ల నీటి సంఘా ల ఎన్నికల ఊసే లేదు. దీంతో రైతులు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. 1997లో సీఎం చంద్రబాబు నీటి సంఘాలకు అంకురార్పణ చేశారు. 1999లో మొదటి ఎన్నికలు జరగగా, తర్వాత 2002, 2008, 2017లో జరిగాయి. అందులో 2008లో తప్ప మిగతా మూడుసార్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగానే ఎన్నికలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 మార్చితో సాగునీటి సంఘాల పదవీకాలం ముగిసింది. అప్పటినుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. ఫలితంగా సాకు నీటి వనరుల నిర్వహణ ముందుకు సాగక రైతులు ఇబ్బందులకు గురయ్యారు. నాలుగున్నర ఏళ్లుగా నిలిచిన ప్రక్రియకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి సంఘాలకు పునరుజ్జీవం వచ్చింది. మండల పరిధిలోని 6 సాగునీటి సంఘాలు టీడీపీ వశమ య్యాయి. శనివారం జరిగిన సాగునీటి నీటి ఎన్నికలు ఏకగ్రీవం అయినట్టు పాల్వాయి ఎన్నికల అధికారి పల్లా రామకృష్ణ ప్రకటించారు. తుమ్మకోట సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పోట్ల నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా కొంగర నాగేశ్వరరావు, రెంటాలకు మద్దిగపు పిచ్చిరెడ్డి, ఉపాధ్యక్షునిగా దాచినేని అమరబాబు, మిట్టగుడిపాడుకు అధ్యక్షుడిగా సింహాద్రి బాపూజీ, ఉపాధ్యక్షునిగా గోవిందరెడ్డి (తేలుకుట్ల), రెంటచింతలకు అధ్యక్షుడిగా తుమ్మా ఎలిషా జోజిరెడ్డి,ఉపాధ్యక్షునిగా షేక్ వలి, పశర్లపాడుకు అధ్యక్షుడిగా వెంపటి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా గోళ్ళ మల్లయ్య, పాల్వాయికి అధ్యక్షునిగా బెల్లంకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షున్ని ఇంకా ప్రకటించలేదు.

11మంది నీటి సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎన్నిక



విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలవ్యాప్తంగా 11మంది అధ్యక్ష కార్యదర్శులను రైతు సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహశీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఇవరాలు ఇలా ఉన్నాయి. హౌస్‌గణేష్ 12వ సంఘానికి వేల్పుల అంకారావు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా కంచెర్ల శ్రీనివాసరావు ఎనికయ్యారు. అదేవిధంగా 94వ సంఘం పొనుగుపాడు గ్రామానికి అధ్యక్షులుగా కారనామా నారాయణ, ఉపాధ్యక్షులుగా మాలి రెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. 95వ సంఘం పొనుగుపాడుకు రాయంకుల చంద్రమౌళి అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా షేక్ మస్తాన్‌వలి ఎన్నికయ్యారు. 101వ సంఘం 113తాళ్ళూరు గ్రామానికి అంచల శంకర రావు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా మల్లవరపు రాయన్న ఎన్నికయ్యారు. 102వ సంఘం తక్కెళ్ళ పాడు గ్రామానికి అధ్యక్షులుగా ఇందూరి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా మాదాసు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 103వ సంఘం బేతపూడి గ్రామానికి అధ్యక్షులుగా నల్లజర్ల రవికుమార్, ఉపాధ్యక్షులుగా తెలగనేని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 104వ సంఘం సుదురుపాడుకు అధ్యక్షులుగా వేల్పూరి బాజి, ఉపాధ్యక్షులుగా నార్నె శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 134వ సంఘం సుదురుపాడు గ్రామానికి అధ్యక్షులుగా తియ్యగూర సాయి ప్రసాదరెడ్డి, ఉపాధ్యక్షులుగా కొల్లి వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. 131వ సంఘం ఫిరంగిపురం గ్రామానికి అధ్యక్షులుగా గణేషుని కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బొండాలపాటి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. 133వ సంఘం రేపూడి గ్రామానికి అధ్యక్షులుగా ఆరె పున్నారెడ్డి, ఉపాధ్యక్షులుగా వల్లేరు జోజిప్ప ఎన్నికయ్యారు. 135వ సంఘం కొండవీడుకు అధ్యక్షులుగా కొసనం వీరాంజనేయులు, ఉపాధ్యక్షులుగా షేక్. ఫురోజ్‌లు ఎన్నియ్యారని తహశీల్దార్ వెల్లడించారు. అదేవిధంగా ఈ సందర్భంగా సంఘాలకు ఎన్నికైన సభ్యులకు తహశీల్దార్ అభినందనలు చెప్పారు.

దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, గుంటూరు రూరల్ మండలం, గొర్లవారిపాలెం గ్రామం, డోరు నెం.7-20/ఏరు కాపురస్తులు **ఓరుగంటి వెంకటేశ్వర్లు గారి కుమారుడు ఓరుగంటి కోటేశ్వరరావు (సెల్: 8143912794)** అను నేను తెలియజేయునది- నా పేరిటకు **డి.19-02-2005**న నల్లపాడు ఎస్ఆర్ఓ నందు రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు **నెం.938/2005 ఒరిజనల్‌ను డి.18-11-2024**న గోరంట్లలోని చైతన్య గోదావరి బ్యాంకులో పని నిమిత్తం వచ్చి గోరంట్లలోని జిరాక్సు షాపులో జిరాక్సు తీయించుకుని టూవీలర్‌పై వెళ్లుచుండగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, సంపత్ నగర్, డోర్.నెం. 25-18-4, కొత్త డోర్.నెం.81-105 కాపురస్తులు మారోజు రత్నాచారి గారి కుమారుడు సూర్యప్రకాష్ గారి సూచనలమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి హైదరాబాద్ కాపురస్తులు 1)డా॥మక్కెన బాలాజీ బాబు, 2) మక్కెన లలితమ్మ గార్లు విక్రయ ద.నెం.4865/2015 యస్.ఆర్.ఓ. నల్లపాడు ద్వారా కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్తిని విక్రయించుటకు బహిరంగ పరచగా నాక్లయింటు కొనుగోలుచేయుటకు సిద్ధపడి విక్రయ బయానా అగ్రిమెంటు కుదుర్చుకొనుచున్నారు. కావున షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు కోర్టు జప్తులు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 10 రోజులలోగా నాకు గాని, నా క్లయింటుకు గాని తెలియజేయగలరు. గడువులోగా షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎటువంటి క్లయిములు రానియెడల నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని, తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు-ఎ:గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి., జి.యం.సి. ఏరియా, ఏ.టి. అగ్రహారం, యస్.బి.ఐ. కాలనీ, గుంటూరు సిటీ, నల్లపాడు గ్రామ డి.నెం. 83/5 భాగం మరియు 84/5 భాగం, డోర్.నెం. 26-43-21, ప్లాట్ నెం.2 & 3లో చ.గ.840లు స్థలములో నిర్మించుచున్న OAK WOOD అపార్ట్ మెంటుకు **హద్దులు.తూర్పు:**ప్లాట్ నెం.9&10 స్థలం,**దక్షిణం:**యం.వెంకటేశ్వరరావు ప్లాటు నెం.4, **పడమర:** మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు, **ఉత్తరం:** పి.యస్.జేమ్స్‌గారి ప్లాట్ నెం.1.

షెడ్యూలు-బి: షెడ్యూలు-ఎ లోని అనిర్థిష్టపు, అవి భాజ్యపు చ.గ.42లు నిర్మించిన OAK WOOD అపార్ట్ మెంటులోని మొదటి అంతస్తులోని సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నెం.2సి చ.అ.1190లు (కామన్ ఏరియా వగైరాలతో సహాకు) **హద్దులు: తూర్పు:** ఓపన్ ఏరియా ఇన్ గ్రౌండ్, **దక్షిణం:** ఓపన్ ఏరియా ఇన్ గ్రౌండ్, **పడమర:** కామన్ కారిడార్ మరియు మెట్లు, **ఉత్తరం:**ఓపెన్ టు స్కై మరియు కామన్ లిఫ్ట్.

ఏలూరి మల్లిఖార్జునరావు, అడ్వకేట్
2వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. సెల్: 9440249055

లోకేష్‌తో చిల్లపల్లి భేటి

విశాలాంధ్ర-తాడేపల్లి : మంత్రి నారా లోకేష్‌ను ఏపీ మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి 100 పడకల ఆసుపత్రిపై నారా లోకేష్‌తో చర్చించారని అన్నారు. నారా లోకేష్ విజన్‌కు తగ్గట్టు మంగళగిరి 100 పడకల ఆసుపత్రి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. అలానే రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా తయారు చేయాలని అనే దానిపై చర్చించారని అన్నారు. మంగళగిరి అభివృద్ధికి నారా లోకేష్ కట్టుబడి ఉన్నారని అన్నారు. రోడ్లు చేనేత భవనం అభివృది గురించి మాట్లాడటం జరిగిందని, దీనిపై నారా లోకేష్ సానుకూలంగా స్పందించి మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే కాదు దేశంలోనే మొదటి స్థానంలో నిలబెడతానని అన్నారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన సౌమ్య

విశాలాంధ్ర-తాడేపల్లి : నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య.. మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని శనివారం ఆమె కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో అనేక పదవులు పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఉన్న మాదిగలకు మీ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

పల్నాటి నాగమ్మ శైవక్షేత్రం నిర్మాణ కమిటీ సమావేశం నేడు

విశాలాంధ్ర-దాచేపల్లి : గామాలపాడులోని శ్రీ రాజరాజేశ్వరీ దేవీ సమేత మహారాజేశ్వరాయ దేవ స్థానం పల్నాటి నాగమ్మ శైవక్షేత్రం నిర్మాణ కమిటీ సమావేశం ఆదివారం జరుగనుంది. నారాయణపురం లోని సీపీఐ కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశా నికి టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 11వ శతాబ్దానికి చెందిన పల్నాడులోని తొలి మహిళా మంత్రి నాయకు రాలు నాగమ్మ నిర్మించిన ఈ పురాతన శివాలయాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తున్నారు. 2025 మార్చి 14న శివలింగాన్ని ప్రతిష్ఠించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం జరిగే ఈ సమావేశానికి ప్రజలు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

రైతు సమస్యలపై మాట్లాడే హక్కు

వైసీపీ నాయకులకు లేదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: గత ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర, పంట నష్టపరిహారం కోసం తెలుగు దేశం పార్టీ రోడ్డెక్కి నిరసనలు తెలియజేసే వరకు కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా రాని వైసీపీ నాయకులు, ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పూర్తి కాకుండానే రైతులకు అన్యాయం జరుగుతుందంటూ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందని, గతంలో రైతులను, ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెట్టిన ఆ పార్టీ నాయకులకు రైతుల గురించి మాట్లాడే హక్కు, అర్హత లేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. వైసీపీ నాయకులు రైతులు సమస్యల్లో ఉన్నారని అసత్య ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని డైవర్ట్ రాజకీయాల్లో భాగంగానే శుక్రవారం ప్రతిపక్ష పార్టీ మాజీ ఎమ్మెల్యేలు కలెక్టరేట్లో వద్ద హడావుడి చేశారని అన్నారు. గత అయిదేళ్లలో రైతన్నలకు కనీస పంట నష్టపరిహారం చెల్లించలేదు, గిట్టుబాటు ధర ఇవ్వలేదని, అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు క్రాప్ ఇన్సూరెన్స్‌పై నిలదీస్తే, అప్పుడు ఆగమేఘాల మీద చెల్లించడం జరిగింది. గత ప్రభుత్వ హయంలో హార్టికల్చర్ ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేకుండా చేశారని ఆయన అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే రైతన్నలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, పంట కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. రైతన్నలకు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీదేనన్నారు. రైతన్నల శ్రేయస్సు కోసం వడివడిగా అడుగులు వేస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఎప్పటికప్పుడు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు.

దేగలను కలిసిన హేమలత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ కఠారి హేమలత ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ)చైర్మన్ దేగల ప్రభాకర్‌ను గుంటూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె దేగల ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొక్కిసం శివరాం, దేగల రవి తదితరులు ఉన్నారు.

ఆటల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: చదువుతో పాటు ఆటపాటల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. స్థానిక వాగ్దేవి డిగ్రీ కాలేజీలో శనివారం జరిగిన జిల్లాస్థాయి కబాడీ క్రీడాకారుల ఎంపిక క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థు లకు పై చదువులతో పాటు, ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం రాయల శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, ఓఎస్ఆర్ పాల్గొన్నారు.

విలేకరులపై దాడులు హేయం

ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కడప జిల్లా పులివెందులలో సాక్షి మీడియాపై జరిగిన దాడి సాక్షిపై జరిగిన దాడిగా కాదని, ఇది యావత్ జర్నలిస్టులపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఎవరైతే దాడి చేశారో చేసిన వ్యక్తులపై తక్షణ చర్యలు తీసుకొని ఇక పై జర్నలిస్టులపై దాడులు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా నాయకులు తెలిపారు. వృత్తిలో భాగంగా వార్త సేకరణలకు వెళ్లే ప్రతినిధులపై దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామని, పత్రిక ఏదైనా సరే విలేకరులపై దాడి చేయటం, దాడిని ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకురావాలని ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యులు పి.భక్తవత్సలం, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.రాంబాబు అన్నారు. శనివారం కడప పులివెందులలో సాక్షి మీడియా ప్రతినిధులపై జరిగిన దాడికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట యూనియన్ సభ్యులు నిరసన తెలియజేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లే కార్డుతో తమ పత్రిక స్వేచ్ఛను కాపాడాలంటూ నిరసన తెలుపుతూ కలెక్టరేట్‌లో డీఆర్ఓ ఎంఎస్‌కె ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నాయకులు గిరిధర్, మార్కండేయులు, బీఎల్ నారాయణ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు వి.కిరణ్ కుమార్, హనీఫ్‌ఖాన్, పరశ్యామ్, కార్తీక్, రత్నాకర్, మొగలయ్య, హకీమ్ జానీ, డి.రమేష్‌బాబు, అశోక్, అభిరాం, రాంగోపాల్, కోటిరెడ్డి, కిరణ్, సుభాని, నాని, కృష్ణ, ప్రకాష్, మల్లి, విక్రన్త్, యాసిన్ పలువురు జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

ఫార్మశీ నిపుణులకు విస్తృత ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్లినికల్ రీసెర్చ్, మెడికల్ డివైసెస్, రెగ్యులేటరీ రంగాలలోని ఫార్మశీ నిపుణులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని క్లినాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ వి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక హిందూ ఫార్మశీ కళాశాలలో హైదరాబాద్‌లోని క్లినాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో 'క్లినికల్ రీసెర్చ్ అండ్ రెగ్యులేటరీ రైటింగ్ ఇన్ మెడికల్ డివైసెస్ ఐఎండీఆర్ అండ్ ఈయూఎండీఆర్' అనే అంశంపై వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలోని వివిధ నగరాలలో సుమారు 100 క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని, వారు నూతన ఔషధాలపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్ ఫార్మకోవిజిలెన్స్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ రెగ్యులేటరీ అప్రూవల్స్ లాంటి పరిశోధనలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. అనంతరం కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు బి.ఫార్మశీతో పాటు క్లినాక్స్ లాంటి సంస్థలు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులను చేయటం ద్వారా తమ ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కళాశాల ఫార్మా డి.డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య వివిధ సంస్థలలోని ఫార్మశీ నిపుణులకు గల ఉపాధి అవకాశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, డాక్టర్ పి.నాగరాజు, సీహెచ్. ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ఐక్యంగా ముందుకు సాగుదాం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : తమ డిమాండ్ల సాధన కోసం ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఐక్యంగా ముందుకు సాగాలని రీజియన్ గౌరవాధ్యక్షులు మేడా హనుమంతరావు పిలుపునిచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ రీజియన్ మహాసభ గుంటూరు కొత్తపే టలోని మల్లయ్యలింగంభవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా హనుమంత రావు మాట్లాడుతూ అసోసియేషన్ స్థాపించి చిన నాటి నుంచి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు అనేక సమస్యలు పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇంకా అనేకం సాధించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, డీఏ కల్పించాలని, సూపర్ లగ్జరీ వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికి ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షన్, పీఎఫ్ హయ్యర్ ఆప్షన్ ఇచ్చి డబ్బులు కట్టిన వారి కేసులు సత్వర పరిష్కారం, అందరికీ హయ్యర్ ఆప్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక:

నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్.పూర్ణచం ద్రరావు, రీజినల్ సెక్రటరీగా కె.శ్రీహరి రాజు, ట్రెజరర్‌గా సయ్యద్ ఖాన్‌లతో పాటు తొమ్మిది మందిని నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-దుగ్గిరాల : పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం డెకాయ్ ఆపరేషన్ ద్వారా 550 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయంపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకట్ రవితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించడం, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు ఇవ్వడంతో గంజాయి విక్రయదారులపై నిఘా పెట్టామని తెలిపారు. 20 నుంచి 25 వయసు కలిగిన యువకులు దుగ్గిరాల, చిలుపూరు గ్రామాలకు చెందిన ముగ్గురు వద్ద గంజాయిని తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాష్ట్రం గంజాయి రహిత రాష్ట్రంగా ఉండాలనేదే ముఖ్య ఉద్దేశమన్నారు. గంజాయిని వికరిస్తున్న సమాచారంతో తమ సిబ్బంది మారువేషంలో వెళ్లి వారి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నట్లు వెళ్లి పట్టుకోవడం జరిగిందన్నారు. గంజాయిని విక్రయిస్తున్న వారిలో దుగ్గిరాలకు చెందిన రావూరి హర్షవర్ధన్, చిలువూరుకు చెందిన బండ్లమూడి వినయ్, కనపర్తి కిరణ్ బాబులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. గంజాయి మత్తులో పరిసరాల గ్రామాల్లో ఉన్న యువకులు వ్యసనాలకు బానిసవుతున్నారని, తల్లి దండ్రులు వారి పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో నిఘా పెడుతున్నామని, సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు. ఎవరైనా గంజాయిను విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం ఖూనీ: సీపీఎం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: దేశంలో జమిలీ ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యంకు ముప్పు ఏర్పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు చెప్పారు. స్థానిక బ్రాడీపేటలోని పి.ఎల్‌రావు భవన్‌లో శనివారం సీపీఎం 25వ జిల్లా మహాసభలు ప్రారంభం అయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగే ఈ మహాసభలలో బాబూరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. సభకు సిపిఎం జిల్లా నాయకులు కె.నళినీకాంత్, ఎస్.ఎస్ చెంగయ్య, ఎల్.అరుణ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ కార్యకర్త తియ్యగూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లాకమిటీ సభ్యులు వల్లభనేని సాంబశివరావుకు మహాసభ సంతాపం తెలిపింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు మాట్లాడారు. ఈసభలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరునీటి సంఘాలు టీడీపీ కైవసం

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని నీటి సంఘాలను, చెరువు సంఘాలను ఏకగ్రీవం అయ్యాయి. కంచికచర్ల మండలంలోని ఆరు సంఘా లను తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా కైవసం చేసు కుంది ఎన్నికైన సభ్యులను నందిగామ శాసన సభ్యు రాలు శ్రీమతి తంగిరాల సౌమ్య, కంచిక చర్ల మండల టీడీపీ అధ్యక్షులు కోగంటి బాబు, అభినందించారు కంచికచర్ల సంఘానికి అంచా శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా గూడవల్లి శ్రీనివాసరావు,బత్తినపాడు సంఘానికి నన్నపనేని లక్ష్మీ, వైస్ ప్రెసిడెంట్‌గా గొర్రిముచు జోజి, గని అత్కూరు సంఘానికి ప్రెసి డెంట్ యరమస శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ గా బండారుపల్లి కోటేశ్వరరావు, గండేపల్లి ప్రెసిడె ంట్ షేక్.సైదా మియా, వైస్ ప్రెసిడెంట్ దగ్గుబాటి మధు, గొట్టుముక్కల ప్రెసిడెంట్ గా గోగినేని కాశేశ్వరరావు,వైస్ ప్రెసిడెంట్‌గా గోనేపల్లి పెద నాగేశ్వరరావు, మొగులూరు సంఘం ప్రెసిడెంట్ కూసు మౌల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నసరత్ పాషా, కంచికచర్ల చెరువు సంఘం అధ్యక్షులుగా కనగాల నరేంద్ర, ఉప అధ్యక్షులు జూలూరి శ్రీనివాసరావు, గొట్టుముక్కల చెరువు సంఘం అధ్యక్షులుగా బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గోగినేని కోటి రామయ్య, పరిటాల చేరువు సంగం అధ్యక్షులుగా గణపనేని సాంబశివరావు, ఉపాధ్య క్షులుగా మంగళగిరి శ్రీనివాస రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నీటి సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-పెడన : పెడన నియోజకవర్గం పరిధిలో పెడన భారీ నీటిపారుదల (వాటర్ బాడీస్) 179 కు సంబంధించి ఎన్నిక నందు అధ్యక్షునిగా కమ్మగంటి వెంకటేశ్వరరావు (బాబు) ఉపాధ్యక్షులుగా వరుదు ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మన్నెం గోపాలరావు తెలిపారు. 179 వాటర్ బాడీస్‌కు సంబంధించి మొత్తం 12 టీసిలుగా ఎన్నుకోవడం జరిగిందని 12 మంది టీసీలలో ఇరువురిని అధ్యక్షులుగా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పెడన మున్సిపల్ కమిషనర్ ఎం గోపాలరావు ప్రాతినిధ్య వహించారు.

సాగునీటి వినియోగదారుల సంఘం శ్రీకాకుళంలో ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఘంటసాల: మండల పరిధిలోని శ్రీకాకుళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారి కేజే శ్రీనివాస్ చంద్, సహాయ అధికారిగా జి.శ్రీనివాసరావుల సమక్షంలో సాగునీటి సంఘం నూతన అధ్యక్షునిగా సుగ్గన రాంబాబు, ఉపాధ్యక్షునిగా కోడి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ వారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీలం శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యుకెచారిటీ సౌజన్యంతో పిల్లలకు ఉచిత గుండె సర్జరీలు

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్ : ఆంధ్ర హాస్పిటల్స్ లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె చారిటీ సౌజన్యంతో 33 వ ఉచిత పిల్లల గుండె సర్జరీలు క్యాంపు డిసెంబర్ 09 నుంచి డిసెంబర్ 14 వరకు నిర్వహించారు. డా॥ నెల్సన్ ఒలివర్ డేవిడ్, పిడియాట్రిక్ కార్డియాక్ సర్జన్, క్వీన్స్ ల్యాండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, ఆస్ట్రేలియా, డా॥ క్రిస్టి యన్ అలెగ్జాండర్, పిడియాట్రిక్ కార్డి యాక్ ఇంటెన్సివిస్ట్, స్టువర్ట్ హ్యారీ, హన్నా ఎలిజబెత్, మోర్గాన్ తదిత రులు క్వీన్స్ ల్యాండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, ఆస్ట్రేలియా నుంచి ఇక్కడకు వచ్చి హార్ట్ అండ్ ట్రెయిన్ ఆంధ్ర హాస్పిటల్స్ డా॥ నాగేశ్వర రావు, కార్డియాక్ సర్జన్, డా॥ సాయి రామ్, పిల్లల కార్డియాక్ సర్జన్ తో కలిసి, ఆంధ్ర హాస్పిటల్స్ లో 16 పిల్లల గుండె ఆపరేషన్లు నిర్వహిం చారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు- టెట్రాలజీ అఫ్ ఫాలో, డి వో ఆర్ వి. పల్మనరీ ఎట్రిసియా, పిపివిడి, పి ఏ బాండింగ్ మరియు ఇతర క్లిష్టమైన గుండె ఆపరేషన్లు ఈ క్యాంపులో నిర్వహించారు. నవ్యంధ్ర ప్రదేశ్‌లో మొట్టమొదటి సరిగా ఇన్ని పిల్లల గుండె ఆపరేషన్లు విజయ వంతంగా చేయటానికి ఆంధ్ర హాస్పి టల్స్ డా॥ విక్రమ్ ఆధ్వర్యంలో పిడియాట్రిక్ కార్డియాలజీ టీం, నవజాత శిశువుల, పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ టీమ్స్ కలిసి చేయటం వలన సాధ్యపడిం దని డాక్టర్ పి.వీ.రామారావు చీఫ్ అఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ & డైరెక్టర్ తెలియచేసారు. ఆంధ్ర హాస్పిటల్స్ లో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్ కార్డియాక్ టీమ్& కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ టీం సహకారంతో ప్రతి రోజు గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. పిల్లల గుండె జబ్బులు వున్నవారు రెండు తెలుగు రాష్ట్రాల నుండి మన హాస్పిటల్ కు వస్తున్నారని చెప్పారు. ఈ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్ర హాస్పిటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె డాక్టర్లు,నర్సులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపుని ఆంధ్ర మదర్ అండ్ చైల్డ్ ఫౌండే షన్, వసుధ ఫౌండేషన్, మహేష్ బాబు ఫౌండేషన్ మ ఎన్టీఆర్ వైద్య సేవ సహకారంతో నిర్వహించామన్నారు.

ఉయ్యూరు-కంకిపాడులో ఏకగ్రీవాలే.!

విశాలాంధ్ర-ఉయ్యూరు: స్థానిక ఉయ్యూరు మండల పరిధిలో 6, కంకిపాడు మండల పరిధిలో 8 సాగునీటి సంఘాల (డబ్ల్యుఏ) కు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవాలు అయినట్లు అధికారులు ప్రకటించారు. స్థానిక మండలం లో డబ్ల్యుఏ అధ్యక్షుడిగా నాదెళ్ల యుగంధర్ (ఉయ్యూరు), గొరిపర్తి సాంబశివరావు (కుందేరు), వెల్లంకి రామ్మోహనరావు (కలవపాముల), తుమ్మల సురేష్ (సాయిపురం) కలపాల ప్రవీణ్ ప్రకాష్ (ముదునూరు), గుంటక నాగిరెడ్డి, (పెదఓగిరాల) లతో పాటు, కంకిపాడు మండలం లో దేవినేని రత్నభూషణ్, (ఈడుపుగల్లు), యార్లగడ్డ రాజారావు (తెన్నేరు), కలకోటి సుబ్బారెడ్డి, (కుందేరు), తుమ్మల జగదీష్ (కోలవెన్ను), పెరవలి సుబ్బారావు, (కోలవెన్ను), యలమంచిలి శ్రీనివాస్ (గొడవర్రు), కొనగళ్ళ సుబ్బారావు (ఉప్పులూరు), పామర్తి లవకుమార్ (వేల్పూరు) లను ఎన్నికైనట్లు ప్రకటించారు.

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : వైష్ణవ ఆలయాల్లో సోమవారం ఉదయం నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం అవుతున్నట్లు గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన తెలిపారు ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరిస్తారన్నారు. మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, అవనిగడ్డ లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు గీతా మందిరం లోని వేణుగో పాల స్వామి వార్లను విశేషంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారన్నారు. గీతా మందిరంలో విశేష పూజలతో పాటు ప్రతిరోజు తిరు ప్పావై ప్రవచనలు చెప్పడం జరుగుతుందన్నారు కావున పాటు జరిగే పూజా కార్యక్రమాలు తిరుపవై ప్రవచనాల లో భక్తులు పాల్గొని విజయవంతం చేసి స్వామి వార్ల కృపాకటాక్షాలు పొందాలన్నారు.

టయోటా కిర్లోస్కర్ మోటార్ నుంచి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్

విశాలాంధ్ర-గుంటూరు: "సెడాన్ టు ది కోర్"గా రూపొందించబడిన పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని టొయోటా కిర్లోస్కర్ మోటార్ ఆవిష్కరించింది. కార్బన్ న్యూట్రల్ లక్ష్యాలను సాధించడంలో తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనం అధునాతన 5వ తరం హైబ్రిడ్ టెక్నాలజీని కలిగి ఉంది. ఈ కొత్త మోడల్ అత్యాధునికమైన సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన ఎక్స్‌టీరియర్స్, ఇంటీరియర్‌లు, సౌకర్యవంతమైన సాంకేతికత అనుసంధానితతో సాటిలేని అధునాతనతను తెస్తుంది. ఇది 3200 ఆర్పీఎం వద్ద 221 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. ఎలక్ట్రానిక్‌గా నియంత్రిత నిరంతర వేరియబుల్ ట్రాన్స్‌మిషన్ తో జత చేయబడిన ఈ వాహనం మృదువైన, డైనమిక్ డ్రైవింగ్ అనుభవాన్ని నిర్ధారిస్తుందని టొయోటా కిర్లోస్కర్ మోటార్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మసకాజు యోషిమురా పేర్కొన్నారు.

చిట్టూర్పులో నీటి సంఘం ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఘంటసాల: మండల పరిధిలోని చిట్టూర్పు సాగునీటి సంఘం అధ్యక్షునిగా దాసరి సతీష్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిట్టూర్పు ఎంపీపీ పాఠశాలలో సాగునీటి సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా దాసరి సతీష్ ఉపాధ్యక్షుడిగా వాసన దుర్గ ప్రసాద్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు నాయకులు గుత్తికొండ వరప్రసాద్ దోనేపూడి గోపికృష్ణ వారిని సత్కరించారు.

రైతులకు మేలు చేసేలా నీటి సంఘాలు పనిచేయాలి: ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నీటి సంఘం పరిధిలోని రైతులు అందరికీ నూతన కమిటీ ప్రతినిధులు మేలు చేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు శనివారము అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నీటి సంఘం ఎమ్మెల్యే కార్యాలయంలో అశ్వరావుపాలెం నీటి సంఘం నూతన అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు ఉపాధ్యక్షుడు రేపల్లె వెంకటేశ్వరరావు (చిన్న అంకమ్మరావు) లను బుద్ధ ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకటరామ్ లు సత్కరించి అభినందించారు తమను ప్రోత్సహించి ముందుకు నడిపిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకులు వెంకట్రాం లను అధ్యక్ష ఉపాధ్యక్షులు అయిన శ్రీనివాసరావు వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించి ధన్యవాదములు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి సరఫరా జరిగేలా నిరంతర పర్యవేక్షణలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు

నీటి సంఘాల ఏకగ్రీవం : టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు నీటి సంఘాల ఏకగ్రీవం కూటమి ఐక్యతకు నిదర్శనం అన్నారు మండల పరిధిలోని మోదమూడలో సాగునీటి సంఘాల అధ్యక్షులుగా బచ్చు వెంకట రఘునాథ్ ఉపాధ్యక్షులుగా జుల వెంకట నాగమల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కార్యాలయంలో కనపర్తి. మండలి వెంకట్ రాములు విజేతలను ఘనంగా సత్కరించారు. వేకనూరు సాగునీటి సంఘ అధ్యక్షుడుగా బోగాది రాజకుమార్ ఉపాధ్యక్షుడిగా నామన పద్మనాభం ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో వీరిని కూడా సత్కరించారు గ్రామంలో సర్పంచ్ తుంగల లక్ష్మి ఉప సర్పంచ్ తుంగల మురళీకృష్ణాలు గుడివాడ నరహరి తుంగల నరేష్ కూటమి నేతలు దృశ్యాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, విశ్వనాధుని మురళి సంఘాల నూతన సభ్యులు తోట సురేష్, బచ్చు రఘునాథ కనకా వేణు తోట రాంప్రసాద్ బోగాది శ్రీను గాజుల శ్రీను గాజుల శివరామకృష్ణ మాదివాడ బాబురావు కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.